## విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో
# యువకుడు అగ్నికి ఆహుతి



తిరుపతిరూరల్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:
మండలంలోని అవిలాల పంచాయతీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మునికుమార్ (38)అనే వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం తెల్లవారుఝామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు ఇంటిలో మంటలు చెలరేగాయి. ఇంట్లో నిద్రించే మునికుమార్, అతని తల్లి అప్రమత్తమై బయటకు వచ్చేసారు. ఇంట్లో ఉండే విలువైన వస్తువులు అగ్నిపాలైతాయని గమనించిన మునికుమార్ వాటిని తీసుకురావటానికి మరల ఇంట్లోకి వెళ్ళి అగ్నికి ఆహుతి అయ్యాడు. దట్టమైన పొగ మధ్యలో చిక్కుకొని, ఉక్కిరిబిక్కిరై ఊపిరాడక మృతి చెందాడు. కొడుకు అకారణంగా మరణించడంతో వృద్ధురాలైన తల్లి కన్నీరు మున్నీరయ్యారు. మునికుమార్‌కు ఇంకా పెళ్ళికాలేదని, ఆ ఇంట్లో తల్లి కొడుకు మాత్రమే ఉండేవారని స్థానికులు తెలిపారు. మునికుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. తిరుపతిరూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి
### జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, అక్టోబర్ 14 ప్రభాతవార్త:



సూళ్లూరుపేట నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ బుధవారం జిల్లా కలెక్టర్ కలిసి విజ్ఞప్తి చేశారు. దొరవారి సత్రం మండలం బురద˘మడుగు గ్రామంలో వర్షాకాలం వస్తే తరచూ ముంపుకు గురి అవుతుందని దీని దృష్టిలో ఉంచుకొని శాశ్వత పరిష్కారాన్ని చేయాలని కోరారు. అలాగేనాయుడుపేట పట్టణంలో ఈద్గాకు, ఇండోర్ స్టేడియం కు, తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజయశ్రీ జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. అలాగే జిల్లా ఎస్పీ సుబ్బారాయుడిని కలిసి నియోజకవర్గంలోని శాంతిభద్రతల విషయమై చర్చించారు.



## పరకామణి ఘటనపై
# సిఐడి డిజి రాకతో మళ్ళీ ఉత్కంఠత !
### పాత్రధారుడ్ని తప్పించిన సూత్రధారులెవరు!!

తిరుమల, అక్టోబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:
భక్తులు ఎంతో భక్తివిశ్వాసాలతో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి సమర్పించే కానుకల లెక్కింపు పరకామణి నుండి విదేశీ కరెన్సీ చోరీచేసిన ఘటనలో సిఐడి సమర్పించే కీలక ఆధారాలపై తదుపరి ఏం జరగనుందనే ఉత్కంఠ నెలకొంది. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తుకు హైకోర్టు ధర్మాసనం సిఐడిని ఆదేశిస్తే తదుపరి విదేశీ కరెన్సీ చోరీలో పాత్రధారుడైన రవికుమార్‌ను తప్పించిన ఘటనలో సూత్రధారులెవరనేది తేలనుందనే భయం అటు టిటిడి వర్గాల్లో ఇటు పోలీస్‌వర్గాల్లో సంచలనం రేకెత్తిస్తోంది. అప్పట్లో జరిగిన ఈ కేసు విచారణ, పూర్తిస్థాయి దర్యాప్తు చట్టపరంగానే సాగించారా!లేక ఏదేని అక్రమాలు చోటుచేసుకున్నాయా అనేది ఇప్పుడు హైకోర్టు ధర్మాసనం వెలువడించే నిర్ణయంపై ఆధారపడనుంది. 2023వ సంవత్సరంలో పరకామణిలో అప్పుడు విధుల్లో ఉన్న సివి రవికుమార్ 920 డాలర్ల విదేశీ కరెన్సీని చోరీ చేశాడు. ఆరోజే అక్కడ నిఘాలో ఉన్న ఏవిఎస్ఓ వై.సతీశ్‌కుమార్ గమనించి అతన్ని పట్టుకున్నాడు. ఆ తరువాత తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. తదనంతరం ఈ కేసు తిరుపతి రెండవ అదనపు మున్సిప్ కోర్టులో విచారణ చేపట్టారు. 2023మేనెల 20వతేదీ ఛార్జిషీట్ ఫైల్ చేశారు. అయితే ఈ కేసును అప్పటి టిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, కొందరు పోలీస్ అధికారులు మధ్యవర్తిత్వం జరిపి అదే సంవత్సరం సెప్టెంబర్ 9వతేదీ లోక్‌అదాలత్‌లో 582 కేసుగా విచారణ సాగింది. గతంలో వైసిపి ప్రభుత్వంలోని పెద్దలు, గత టిటిడి బోర్డులో పెద్దలు, ఓ ఉన్నతాధికారి, ఓ పోలీస్ అధికారి కీలకంగా వ్యవహరించి వాటాలు పంచుకుని లోక్‌అదాలత్‌లో రాజీచేశారనేది ప్రధాన ఆరోపణ గుప్పుమంటోంది. దీనిపై హైకోర్టు ధర్మాసనం ఆదేశంతో మంగళవారం సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ తిరుమలకు చేరుకుని సిడి రికార్డులు, ఎఫ్ఐఆర్‌ను స్వాధీనం చేసుకున్నారు. తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, 1టౌన్ సిఐ విజయకుమార్, టిటిడి విజిలెన్స్ వింగ్ విఎస్ఓ ఎన్టీవిరామ్‌కుమార్ ,ఆలయ ఏవిఎస్ఓ రాజశేఖర్‌తో కలసి పరకామణి భవనాన్ని తనిఖీ చేశారు. స్వయంగా పరకామణి భవనంలోకి చేరుకుని కానుకల లెక్కింపు, నోట్లు, నాణేలు వేరు చేయడం, లెక్కించడం, భద్రతాపరమైన అంశాలను స్వయంగా గమనించారు . ఈ కేసు శ్రీవారి భక్తుల్లో కూడా ఒకింత ఆసక్తికర అంశంగా మారింది.

## 32 వేల మామిడి రైతులకు
# రూ.147 కోట్ల సబ్సిడీ జమ
### సబ్సిడీ జమ కాని రైతులు ఈ నెల 30వ తేదీలోపు వినతులు సమర్పణ
### ధర చెల్లించని ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రభుత్వ సహకారం ఉండదు : కలెక్టర్



చిత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:
మామిడి రైతులకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జిల్లాలోని 31,929 మంది రైతుల బ్యాంకు వ్యక్తిగత ఖాతాలకు రూ.146.84 కోట్ల సబ్సిడీని జమ చేసిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ మామిడి రైతుల సబ్సిడీ జమపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ మామిడి రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం కేజీ మామిడిపై రూ.4 సబ్సిడీ ప్రకటించిందని, దాని ప్రకారం జిల్లాలో 31,929 మంది రైతులకు సంబంధించి 3.67 లక్షల మెట్రిక్ టన్నుల మామిడికి రూ.146.84 కోట్లను డిబిటి పద్ధతిలో నేరుగా రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. ఇందులో బంగారుపాళ్యం మండలానికి చెందిన మామిడి రైతులకు ఎక్కువ మొత్తం జమ అయ్యిందని, అలాగే జిల్లాలో 20 వేల మందికి పైగా రైతులకు లక్ష రూపాయలకు మించి సబ్సిడీ జమ అయ్యిందన్నారు. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో లేని విధంగా మామిడి రైతులకు సబ్సిడీ, మద్దతు ధరలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అందించిందన్నారు. మామిడి రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వానికి జిల్లా మామిడి రైతాంగం తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ-క్రాప్ బుకింగ్, క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం సబ్సిడీ పరంగా ఖచ్చితమైన నిర్ధారణకు రావడం జరిగిందన్నారు. అర్హత కలిగి నగదు జమ కాని మామిడి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అక్టోబర్ 30వ తేదీ వరకు తమ వినతులను ఆర్ఎస్‌కె, మండల, జిల్లా స్థాయి ఉద్యాన అధికారులకు సమర్పించవచ్చునన్నారు. వారి అర్హతను 48 గంటల్లోపు నిర్ధారించడం జరుగుతుందన్నారు. రూ.5 లక్షలకు మించి సబ్సిడీకి సంబంధించి 21 మంది రైతులు వున్నారని వీరి అర్హతను పరిశీలించి నగదు జమ చేస్తామన్నారు. గుడిపాల, పుంగనూరు, బంగారుపాళ్యంలోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధరలను మామిడి రైతులకు అందించని కారణంగా ప్రభుత్వ పరంగా పరిశ్రమల శాఖ నుండి ఎటువంటి సహకారం అందించడం జరుగదని, రైతుకు మేలు చేసే పరిశ్రమలకు మరింత ప్రోత్సాహకాలు, సహకారం అందించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు కేవలం రాజకీయంగా, వ్యాపారపరంగా మాత్రమే కాకుండా రైతుల సంక్షేమంను సైతం కొంత దృష్టిలో వుంచుకుని పని చేయాలన్నారు. ఈ సమావేశంలో ఉద్యానశాఖ డిడి మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

# ముగిసిన కోదండరాముల పవిత్రోత్సవాలు
### కన్నుల పండువగా స్నపనతిరుమంజనం



చంద్రగిరి, అక్టోబర్ 14 ప్రభాతవార్త:
స్థానిక టిటిడి అనుబంధ శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు మంగళవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఇందులో భాగంగా స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, సహస్రనామార్చన, నిత్యార్చన గావించారు. తదుపరి యాగశాల వద్ద ద్వారాతోరణ, ధ్వజ కుంభారాధన, చతుష్టార్చన, మూర్తిహోమం, శాంతిహోమం, మహాపూర్ణాహుతి, పవిత్ర వితరణ, వేదశాత్ మొర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమంత స్వామి, చక్రతాళ్వార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. తదుపరి చక్రతాళ్వార్‌కు చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమంత స్వామి వార్లు తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## జాతీయ శిఖరాగ్ర సమావేశానికి
# తిరుపతి మేయర్‌కు ఆహ్వానం

తిరుపతి, అక్టోబర్14 ప్రభాతవార్త:



అహ్మదాబాద్‌లో ఈనెల 15,16 తేదీలలో జరిగే మేయర్ల జాతీయ శిఖరాగ్ర సమావేశానికి తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష ఆహ్వానం లభించింది. 'నేషనల్ అర్బన్ కన్‌క్లేవ్ అండ్ మేయరల్ సమ్మిట్ ఫర్ షాపింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ సిటీస్' పేరుతో జరగనున్న ఈ శిఖరాగ్ర సమావేశానికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకోనున్నది. దేశంలో ఉన్న పురాతన నగరాలలో అహ్మదాబాద్ ఒకటి. భారత మాజీ ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఈ సమావేశాలు జరగడం విశేషం. రెండురోజుల పాటు జరిగే జాతీయ సమావేశంలో పలు అంశాలపై మేయర్ డాక్టర్ శిరీష విశదీకరించనున్నారు.

# నవంబర్ 17 నుండి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

తిరుచానూరు, అక్టోబర్ 14, ప్రభాత వార్త:



తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబర్ 17 నుండి 25వ తారీకు వరకు నిర్వహించినట్లు తితిదే ప్రకటన ద్వారా తెలియజేశారు. ఇందులో భాగంగా నవంబరు 11వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టాను న్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగ నున్నాయి అని తెలిపారు. ఈ అమ్మవారి బ్రహ్మోత్సవాలు 17వ తేదీ ధ్వజారోహణం, చిన్నశేషవాహనంతో ప్రారంభమై, 18న పెద్దశేషవాహనం, హంసవాహనం, 19న ముత్యపు పందిరి వాహనం, సింహవాహనం, 20న కల్పవృక్షవాహనం, హనుమంత వాహనం, 21న పల్లకి ఉత్సవం, ప్రధానమైన గజవాహనం, 22న సర్వభూపాలవాహనం, స్వర్ణ రథం, గరుడ వాహనం, 23న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 24న రథోత్సవం, అశ్వవాహనం, 25న పంచమి తీర్థం, ధ్వజ అవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు.

# సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ శిక్షణకు సర్పంచ్‌లు డుమ్మా...?
### శిక్షణకు సుముఖత చూపని సర్పంచ్‌లు, మండలాధ్యక్షులు -వెలవెలబోయి...అభాసుపాలైతున్న శిక్షణా కార్యక్రమం

తిరుపతిరూరల్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామ పంచాయతీలు అభివృద్ధి వైపు తీసుకెళ్ళటానికి గ్రామ సర్పంచ్‌లకు, మండలాధ్యక్షులకు 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని తిరుపతిరూరల్ ఎంపిడిఓ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఆర్.జి.జి.ఎస్.ఏ కార్యచరణ ప్రణాళిక 2025-26కు సంబంధించి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ థీమ్ 1 నుండి 8 అంశాలు ప్రణాళిక ప్రకారం జరిగేలా మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి పర్యవేక్షించాల్సి ఉంది. ఈనెల 13, 14 తేదీలలో యర్రావారిపాళ్యం, రేణిగుంట, తిరుపతిరూరల్ మండలాలకు సంబంధించిన గ్రామ సర్పంచ్‌లకు, మండలాధ్యక్షులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో యర్రావారి పాళ్యం, రేణిగుంట మండలాలకు సంబంధించిన గ్రామ సర్పంచ్‌లు,



మండలాధ్యక్షులు పూర్తిగా ఎవరు రాలేదు. తిరుపతిరూరల్ మండలం నుండి వెంకటపతినగర్, చెర్లోపల్లి, సి.మల్లవరం, పద్మావతిపురం, గాంధీపురం గ్రామ సర్పంచ్‌ల మినహా ఏ ఒక్కరూ హాజరు కాలేదు. మూడు మండలాలకు సంబంధించి సర్పంచ్‌లు, మండలాధ్యక్షులు హాజరు కానందున శిక్షణా కార్యక్రమం వెలవెలబోయి... అభాసుపాలైతుంది. ఈ శిక్షణకు ఎంపిడిఓ కోర్సు డైరెక్టర్‌గాను, డిప్యూటీ ఎంపిడిఓ అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్‌గాను వ్యవహరించాలి ఉంది. ఆయా మండలాలలో జరిగే శిక్షణా కార్యక్రమంకు ఆయా మండలంలో ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, మండలాధ్యక్షులు హాజరు అయ్యే విధంగా సదరు మండల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఆయా గ్రామ పంచాయతీలను ఏవిధంగా అభివృద్ధి చేసుకోవాలి, వనరులను ఏవిధంగా సమకూర్చుకోవాలని, పేదరికాన్ని ఎలా జయించాలి, ఆరోగ్యకరమైన నవ సమాజాన్ని ఎలా నిర్మించుకోవాలి తదితర అంశాలను శిక్షణా కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ శిక్షణ ఇస్తారు. ఎపిఎస్ఐఆర్డి అండ్ పిఆర్ కమీషనర్ ఉత్తర్వుల మేరకు ఈనెల 13 నుండి 16వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

# ఆరోగ్యకరమైన పిల్లల ద్వారానే ఆరోగ్యకరమైన దేశం నిర్మితం

తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:
ఆరోగ్య కరమైన పిల్లల ద్వారానే ఆరోగ్య కరమైన దేశం నిర్మితం అవుతుందని, ఆరోగ్య కరమైన పిల్లల కోసం ప్రతి తల్లి పౌష్టికరమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లో జాతీయ పోషకాహార మాసోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పి.డి. ఐ.సి.డి.ఎస్. వసంత బాయితో కలసి పిల్లల తల్లులకు ఆరోగ్య పోషకాలపై జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ .ప్రధాన మంత్రి 2018లో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ద్వారా వివిధ రకాల పోషకాహారం అందించే కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ సెంటర్ ల ద్వారా అమలుచేయడం జరుగుతుందన్నారు. ఐసిడిఎస్ పి.డి వసంత బాయి మాట్లాడుతూ పోషణ మాసోత్సవం ద్వారా పిల్లల ఎదుగుదలకు వారి తల్లులకు ఐసిడిఎస్ శాఖ ద్వారా అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమాన్ని టాటా ట్రస్ట్, విజయ వాహినీ ట్రస్ట్, హెల్త్, ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్మెంట్ వారి సమన్వయంతో నిర్వహిస్తున్నా మని తెలిపారు. ఆటల పోటీలను నిర్వహించి గెలిచిన వారికి జిల్లా కలెక్టర్ ద్వారా బహుమతులను అందించారు. అనంతరం ఐసిడిఎస్ శాఖ ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించి సిబ్బం దిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డి.ఐ.ఓ. డా శాంతా కుమారి,



డి.ఈ.ఓ. కేవిఎన్ కుమార్, టాటా ట్రస్ట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, విజయ వాహిని ట్రస్ట్ నుండి వీరబాబు, స్కిల్ డెవలప్మెం ట్ అధికారి లోకనాథం, ఐసిడిఎస్ జిల్లా నోడల్ అధికారి వాసంతి, సి.డి.పి.ఓలు, సూపర్ వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఐ సి డి ఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దీపాలపై ఆంక్షలు సడలించేనా?
### అమలు భక్తుల మనోభావాలా? నాయకుల ఆదేశాలా?



శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త
కార్తీక మాసం అంటే భక్తులకు ఆనందం. ప్రతి రోజూ శివయ్యను దర్శించుకొని దీపాలు వెలిగించే స్థానిక భక్తులు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. ముఖ్యంగా సోమవారాల్లో నాలుగు వారాలు ఆలయానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగున ఉన్న తమిళనాడు, కర్నాటకల నుంచి భారి ఎత్తున భక్తులు కదలి వస్తారు. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్న దివ్యక్షేత్రం. కాశీలో మరణం శ్రీకాళహస్తిలో కాలుమోపటం మోక్షానికి మార్గమని పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడి కాలుమోపి దీపం వెలిగిస్తే మంచిదనేది భక్తుల మనోభావం. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చేభక్తులను వ్యాపారులు దీపాల పేరుతో టోపి వేస్తున్నారనే నెపంతో ప్రస్తుత పాలకుల ఆదేశాలంటూ దీపాల విక్రయాలు నిషేధించారు. దాంతో ఇక్కడకు వచ్చిన భక్తులు ఇదేమీ చోద్యమని వాపోతున్నారు. శైవ క్షేత్రంలో దీపాలు వెలిగించే సంప్రదాయం ఎంతో కాలంగా వస్తుంది.

### వ్యాపారులను కట్టడి చేయలేరా?

శ్రీకాళహస్తీశ్వరాలయానికి కావాల్సినంత మంది సిబ్బంది, సెక్యూరిటి, హోంగార్డులు, ఎస్‌పిఎఫ్ ఉద్యోగులున్నారు. వ్యాపారులు భక్తులను నిలువు దోపిడి చేస్తున్నారని ప్రస్తుతం పసుపు దారాల అమ్మకాలపై నిఘా ఉంచి కట్టడి చేస్తున్న అధికారులు, పోలీసులు నేతి దీపాల పేరుతో దోపిడికి గురి చేసే వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేరు? ఎందుకు కట్టడి చేయలేరు? మహాక్షేత్రాల్లో దీపాలు వెలిగించటానికి 'ధుని ఏర్పాటు' చేసి ఉన్నారు. షిరిడిసాయి దివ్యక్షేత్రంలో ధునిలో పూజా సామగ్రి టెంకాలను వేస్తారు. శబరిమలలో భక్తులు తెచ్చి ఇరుముడిని సమర్పించటానికి ధుని ఏర్పాటు చేయబడి ఉంది. ఇలా ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేసి ఉన్నారు. మరి శ్రీకాళహస్తి పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన ప్రసిద్ది చెందిన క్షేత్రం. ఈ దివ్యక్షేత్రంలో వ్యాపారులను కట్టడి చేయలేరా? ఎక్కడో ఒక చోట భక్తుల మనోభావాలకు ప్రాధాన్యత ఇస్తూ ధుని ఏర్పాటు చేయవచ్చు కదా? అనే ఆవేదన వ్యక్తం అవుతుంది. ఆలయం లోపల కాకుంటే ఆలయానికి సమీపంలో ధుని ఏర్పాటు చేసి భక్తుల మనోభావాలకు ప్రాధాన్యత ఇవ్వలేరా? మరి ఏ నాయకుని ఆదేశాలో ఏమో కానీ దీపాల అమ్మకాలపై ఆంక్షలతో శివయ్య సన్నిధిలో దీపాలు వెలిగించాలని వచ్చి మనోభావాలను దెబ్బతీస్తున్నారు. ఆలయంలో అవినీతిని అరికట్టామని చెబుతున్న పాలకులు నేతి దీపాల అమ్మకాలలో భక్తుల దోపిడిని అరికట్టలేరా? అనే విమర్శలు చోటు చేసుకున్నాయి.

### కార్తీక మాసం దీపాలు ఎక్కడ వెలిగించాలి?

శ్రీకాళహస్తీశ్వరాలయం గత ఏడాది భక్తుల మనోభావాలకు అనుగుణంగా దీపాలను వెలిగించుకొనుటకు ప్రస్తుతం కౌంటర్ల షెడ్డులు ఏర్పాటు చేస్తున్న చోట పెద్ద షెడ్డు వేసి స్వామి అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేసి అక్కడ దీపాలు వెలిగించుకొనుటకు ఆలయాధికారులు అవకాశం కల్పించారు. అయితే ఈ ఏడాది అక్కడ యుద్ధ ప్రాతిపదికపై కౌంటర్ల షెడ్డు నిర్మాణం జరుగుతుంది. మరి భక్తుల దీపాల వెలిగింపుకు ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది ప్రశ్నార్థకంగా ఉంది. ఈ అంశానికి సంబంధించి ప్రభాతవార్త డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డిని వివరణ కోరగా ప్రత్యామ్నాయ స్థలం కేటాయింపుకు పరిశీలిస్తున్నట్లు వివరణ ఇచ్చారు. మరో వారం రోజుల్లో కార్తీక మాసం ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు పరిశీలనల్లోనే ఉన్నారని చెబుతున్నారు.

# కంగుందిలో పర్యాటకం అభివృద్ధికి చర్యలు
### బౌల్డరింగ్.. రాక్ క్లైంబింగ్ విన్యాసాలకు త్వరలో శ్రీకారం !!
### శిక్షణ నిమిత్తం పుణే వెళ్లిన కంగుంది యువకులు !!

కుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త
వెయ్యేళ్ల చరిత్రకు సాక్ష్యంగా నిలిచే కంగుంది గ్రామంలో పర్యాటక రంగం అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో తగు చర్యలు చేపడుతున్నారు. ఇక్కడ పర్యాటక అభివృద్ధికి తదేకం ఫౌండేషన్ ము ందుకు వచ్చింది. కంగుంది గ్రామంలోని పురాతన కొండపై ట్రెక్కింగ్, బౌల్డరింగ్, రాక్ క్లైబింగ్ విన్యాసాలకు ఇటీవల ట్రయల్స్ నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన పర్యాటకులు కంగుందిలోనే మకాం పెట్టి ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్ వంటి సాహస విన్యాసాలు చేసి అలరించారు. ఇకపై కంగుంది కొండ వద్ద వీటిని యధావిధిగా కొనసాగించాలని నిర్ణయించారు. రానున్న జనవరి నెలలో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. పర్యాటకులు బస చేసేందుకు సైతం స్టే హోమ్‌లు ఇటీవల తాత్కాలికంగా ఏర్పాటుచేశారు. కాగా రాక్ క్లైంబింగ్, బౌల్డరింగ్ విన్యాసాలు మరింత సులువుగా నేర్చుకునేందుకు కంగుంది గ్రామానికి చెందిన నలుగురు యువకులు మహారాష్ట్రలోని పూణే నగరానికి శిక్షణ నిమిత్తం వెళ్లారు. వీరు అక్కడ రెండు నెలలపాటు శిక్షణ తీసుకుంటారు.

**పర్యాటకుల మదిదోచే ప్రాంతం :** కంగుంది అటవీప్రాంతం పర్యాటకుల మదిని ఇట్టే దోచేస్తుంది. వేలాది ఎకరాల్లో వ్యాపించి ఉన్న ఈఅటవీ ప్రాంతం పర్యాటకులను కనువిందు చేస్తుంది. ఇదివరకే గతంలో సిఎం చంద్రబాబునాయుడు నిధులు మంజూరు చేయడంతో కంగుంది దుర్గం చేరుకునే ందుకు మెట్లు, ఇనుప గ్రిల్స్ వంటివి ఏర్పాటుచేశారు కంగుంది సమీపంలో నాయనూరు మార్గం పచ్చటి ప్రకృతి మధ్య ఊటీ అందాలు తలపించేలా ఉంటుంది. ఇక్కడే దిబ్బరేవు ఉంది. ఇక్కడ సెలయేటిలో నీళ్ల పారుతూ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. అలాగే పెద్దవంక గ్రామ సమీపంలో శ్రీ కనకనాంచారమ్మ ఆలయ ప్రాంతం సైతం విశేషంగా అలరిస్తుంది. క ంగుంది సమీపంలోనే రామకుప్పం మండలంలో చెలిమిచేను జలపాతం, ననియాల ఎకో టూరిజం వంటి పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి.



## గణనాధుని సన్నిధిలో మాజీమంత్రి పెద్దిరెడ్డి



**కాణిపాకం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరెండెంట్ వాసు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సునీల్‌కుమార్, లలితా థామస్, చిత్తూరు నియోజవర్గ వైకాపా ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి, ఐరాల,తవణంపల్లె మండలాల వైకాపా అధ్యక్షులు బుజ్జిరెడ్డి, సిద్దంపల్లె హరిరెడ్డి, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్‌లు మోహన్‌రెడ్డి, జగన్నాధరెడ్డి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ లీలజా సుధీర్,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు, వైకాపా నాయకులు చిన్నారెడ్డి,పరమేశ్వరరెడ్డిలతో పాటు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో కర్నాటక మంత్రి



**కాణిపాకం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** కర్నాటక రాష్ట్ర మంత్రి శరణబసప్ప దర్శనపూర్ మంగళవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే వారు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## తొడతర వద్ద టమోటా వ్యాను బోల్తా



**తవణంపల్లె,అక్టోబర్ 14 ప్రభాతవార్త:** మండలంలోని గాజులపల్లె-సరకల్లు రోడ్డులోని తొడతర బహుదానది వద్ద టమోటా వ్యాను మంగళవారం మధ్యాహ్నం బోల్తాపడింది. పుంగనూరు నుండి మండలంలోని కామాలూరు వద్ద నున్న సిద్దార్థ జ్యూస్ ఫ్యాక్టరీకి టమోటాలను తీసుకువెళుతున్న టమోటా వ్యాను తొడతర సమీపంలోని బహుదానదిలో అదుపు తప్పి బోల్తాపడింది. గత వారం రోజుల క్రితం కురిసన భారీ వర్షాలకు బహుదానదిపై వున్న కాజ్‌వే కొట్టుకుపోవడంతో రోడ్డు సక్రమంగా లేక వ్యాను అదుపుతప్పి బోల్తా పడింది. దీనితో అందులో వున్న టమోటాలు ధ్వంసమయ్యాయి. అయితే వ్యానులో వున్న వారికెవ్వరికి ఎటువంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు.

## అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓచే తవణంపల్లె పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



**తవణంపల్లె, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:** మండల కేంద్రం తవణంపల్లె పీహెచ్‌సీని జిల్లా అదనపు డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకట ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా పీహెచ్‌సీ నుండి మండలంలోని ఎంఎల్‌హెచ్‌పీలతో టిబి ముక్త భారత్ కార్యక్రమంపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వీలైనంత త్వరగా వల్నరబుల్ పాపులేషన్ స్క్రీనింగ్ లక్ష్యాలను వందశాతం ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్లు ఎన్.గోపి,నిర్మలమ్మ,ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల్లో సవరణలకై 50 వినతులు స్వీకరణ



**తవణంపల్లె,అక్టోబర్ 14 ప్రభాతవార్త:** మండలంలోని అరగొండ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని నల్లప్పరెడ్డిపల్లె గ్రామంలో రేషన్ కార్డుల్లో సవరణలకై ప్రజలన ఉండి సుమారు 50 వినతులు స్వీకరించారు. అరగొండ సింగిల్ విండో ఛైర్మన్ ఎ.రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో నూతనంగా మంజూరు చేసిన రేషన్‌కార్డుల్లో వున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నూతన రేషన్ కార్డుల్లో ఇంటిపేరు, యజమాని పేరు, కుటుంబసభ్యుల పేర్లు వంటి తప్పుల సవరణకై గ్రామస్థుల నుండి 50 వినతులను స్వీకరించారు. ప్రజలనుండి వచ్చిన అర్జిలకు సంభదించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రంజిత్‌రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పైమాఘం రఘుపతి, క్లస్టర్ కో కన్వీనర్ కంప్యూటర్ శివ, యూనిట్ కో-ఆర్డినేటర్ డి.సతీష్‌లతో పాటు సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 8వ రాష్ట్రీయ పోషణ అవగాహన కార్యక్రమం

సదుం అక్టోబర్ 14 ప్రభాతవార్త



మండలం పరిధిలోని బూరగమంద పంచాయతీ గంటావారిపల్లెలో ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం లోగర్భిణీ స్త్రీలకు, అంగన్వాడీ పిల్లలకు, పిల్లల తల్లిలకు పోషణ ఆహార పదార్థాల గురించి వివరించారు. ఫ్యాక్టరీ నుంచి తయారవుతున్న ఎటువంటి పదార్థాలను తినకూడదు సహజంగా పండే ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు వంటి పదార్థాలను తినాలి. కలుషిత ఆహార పదార్థాలను తింటే అనారోగ్యంతో ఇబ్బందులు పడతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గర్భవతులకు సీమంతం చేశారు.పులిచెర్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి వాణి శ్రీదేవి, సూపర్వైజర్ మల్లీశ్వరి , ప్రధానోపాధ్యాయురాలు మేఘన, అంగన్వాడి కార్యకర్తలు, మహేశ్వరి, అమృత, లలిత గర్భిణీ స్త్రీలు, అంగన్వాడి పిల్లలు , పాల్గొన్నారు.

## వరుస తప్పుడు ప్రచారాలతో

ఇద్దరు వైసిపి వ్యక్తులు అరెస్టు



**తిరుపతి,అక్టోబర్ 14ప్రభాతవార్త:** తిరుపతిలో కల్తీమద్యం కలకలం,ఎన్‌బ్రాండ్ మద్యం తాగి ఆపస్మారకస్థితిలోకి వ్యక్తి ఇలా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తూ, ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న ఇద్దరు వైసిపి వ్యక్తులను తిరుపతి పోలీసులు అరెస్టు చేశారు. చట్టపరంగానే ,ఆధారాలతో అరెస్టుచేయడం జరిగిందని, దీనిపై తప్పుడుగా ఆ పార్టీ ప్రజలను నమ్మించడం మంచిదికాదని పోలీసువర్గాలు వాదన. ఈ అరెస్టుకు సంబంధించి తిరుపతి అదనపు ఎస్పీ రవిమనోహరచారి, తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, ఈస్టు సిఐ శ్రీనివాసులు మంగళవారం సాయంత్రం మీడియాకు తెలిపారు. తిరుపతిలో కల్తీమద్యం కలకలం-ప్రజల భద్రత ఎక్కడ?, ఎన్‌బ్రాండ్ మద్యం సేవించి అపస్మారకస్థితిలో అనే విధంగా తప్పుడు ప్రచారాలు చేసి ప్రజల్లో ఆందోళన రేపే విధంగా వార్తలను వ్యాప్తిచేయడంతో తిరుపతి ఈస్టు పోలీసులు కేసు నమోదు చేశారు. తదుపరి దీనిపై విచారణలో ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం వద్ద వ్యక్తిగత సహాయకుడు చంద్రశేఖర్ వెంకటేశ్(25),ను మరోకతను బ్రుంగి నవీన్(38)వైసిపి సోషల్‌మీడియా టీం సభ్యుడిని అరెస్టుచేయడం జరిగిందన్నారు. వీరు కలసి తిరుపతి ఎక్సైజ్‌శాఖ అదికారులపై అపనిందలతో ఉద్దేశ్యపూర్వకంగా కుట్ర చేశారని తెలిసింది. చట్టప్రకారం చర్యలు తీసుకున్నామని అదనపు ఎస్పీ చారి తెలిపారు.

## ఔషధమొక్కలతో మెరుగైన అవకాశాలు

సీఈఓ చంద్రశేఖర్



**తిరుపతి,అక్టోబర్ 14ప్రభాతవార్త:** ఔషధమొక్కల పెంపకంద్వారా ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచు కోవచ్చని రాష్ట్ర ఔషధ మొక్కలు, సుగం ద్రవ్యాల బోర్డు సిఈఓ ఆవుల చంద్రశేఖర్ తెలిపారు. ఎస్వీఆర్ట్సు కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరావు, వృక్షశాస్త్రంవిభాగాధిపతి ఏ.సురేఖ ,పూర్వ అదిపతి డాక్టర్ ఎం.నాగరాజు,ఫ్యాకల్టీలు డాక్టర్ ఎం.సుధాకర్, డాక్టర్ కె.సుజాత, ఎస్వీఆయుర్వేదకళాశాల సహాయ ప్రొఫెసర్ డాక్టర్ పవన్‌కుమార్ ,శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.సాయివెంకటేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆవుల చంద్రశేఖర్ మాట్లాడుతూఔసధ మొక్కల ప్రాముఖ్యతను గురించి చక్కగా వివరించారు. హెర్బల్‌గార్డెన్‌ను ఇక్కడ అభివృద్ది చేయవచ్చని సూచించారు. ఇప్పటికే ఉన్న మొక్కలను గుర్తించి వాటికి సంఖ్యలు కేటాయించాలని ,రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఈ ప్రాజెక్టుకు 6.25లక్షలు రూపాయలు నిధులువిడుదలకు సీఈఓ హామీ ఇచ్చారు. ఔషధమొక్కల విలువలు గుర్తించేలా, ఆధునిక విజ్ఞానాన్ని ఉపాధి అవకాశాలను వివరించారు.

## మున్సిపల్ ఛైర్మన్‌చే డ్రైనేజ్ మరమ్మతులు



**కుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త** మున్సిపల్ పరిధిలోని గుల్లేపల్లి గ్రామంలో వర్షపు నీరు కాలువల్లో చేరి పైకి రావడంతో సమస్య తలెత్తింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ మంగళవారం జెసిబి యంత్రంతో దగ్గరుండి మున్సిపల్ కార్మికులచే డ్రైనేజ్ కాలువను శుభ్రం చేయించి మరమ్మత్తులు చేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## నేతలచే మున్సిపల్ కమీషనర్..ఛైర్మన్‌లకు సన్మానం

కుప్పం,అక్టోబర్ 14 ప్రభాతవార్త



కుప్పం మున్సిపాలిటీకి సిఎం చంద్రబాబు నాయుడు స్వచ్ఛాంధ్ర 2025 అవార్డు అందించడంతో మంగళవారం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసులు, ఛైర్మన్ సెల్వరాజ్‌లను పలువురు కౌన్సిలర్లు, రెస్కో డైరెక్టర్లు,స్థానిక నేతలు కలసి ఘనంగా సత్కరించారు. మున్సిపాలిటీని శుభ్రంగా ఉంచేందుకు ఛైర్మన్, కమీషనర్‌లు చూపుతున్న చొరవ ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్లు జీమదాము, సోమశేఖర్,సురేష్, గణపతి,సోము,రెస్కో డైరెక్టర్లు ఆర్ముగం, శివ, నేతలు వేణుగోపాల్, దయాకర్, శారదమ్మ, నాగభూషణ ం పాల్గొన్నారు.

## నృత్యకళాకారులకు దేశం నేత కన్నన్‌చే ఆర్థికసాయం

కుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త



స్థానిక వడ్డిపల్లి గ్రామానికి చెందిన యువత నృత్య కళాకారులకు క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్ తనవంతుగా ఆర్థికసాయం అందించారు. వివిధ ప్రాంతాల్లో పలు ప్రదర్శనలు నిర్వహిస్తూ ప్రతిభ చూపుతున్న నృత్య కళాకారులకు కన్నన్ తనవంతుగా ఐదువేల రూపాయల ఆర్థికసాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో మరింత సహాయ సహకారాలు తనవంతుగా అందిస్తాననిఆయనపేర్కొన్నారు. ఈసందర్భంగా నృత్యకళాకారులు దాత కన్నన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## సింగిల్‌విండోలో తక్కువ వడ్డీకే రుణాలు

కుప్పం,అక్టోబర్ 14 ప్రభాతవార్త



కుప్పం ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం (పిఏసిఎస్)లో తక్కువ వడ్డీకే రైతులకు, ప్రజలకురుణాలు అందిస్తున్నట్లు పిఏసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, డిసిసిబి సూపర్‌వైజర్ వెంకటేష్, సిఇఒ రాజేంద్ర పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బ్యాంకు పరిధిలో బంగారంపైగ్రాముకు 6700రూ.ల వంతున రుణంగా చెల్లించడం జరుగుతుందన్నారు. కేవలం 10.5శాతం మేర 85పైసలు మాత్రమే గ్రాముకు వడ్డీగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే రైతులకు పంట రుణాల కింద 2-5లక్షల మేర రుణాలు అందించడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో గృహాల తాకట్టు రుణాలు కూడా 5లక్షల దాకా అవసరం ఉన్న వారికి అందించడం జరుగుతుందన్నారు. గతంలోరుణాలు పొందిన వారు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని వారుకోరారు.

## గ్రామాల్లో ఉచిత రక్త పరీక్ష శిబిరాలు



**రామకుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో గ్రామాల్లో ఉచిత రక్త పరీక్ష శిబిరాలు మండలంలో కొనసాగుతున్నాయి. మంగళవారం రామకుప్పం, లింగాపురంలో రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు ఏదేని అనారోగ్య సమస్యలు ఉంటే రక్త పరీక్షల ద్వారా వారికి తగు వైద్య సేవలు అందించనున్నారు. ఈ శిబిరాలకు విశేషస్పందన వస్తోంది. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ రవిరెడ్డి, నేతలుసుబ్రమణ్యం, కోదండరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి,మోహన్‌బాబు, చంద్రబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పాడి రైతుల సంక్షేమమే శ్రీజ డైరీ ప్రథమ లక్ష్యం



**కల్లూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త** పాడి రైతుల సంక్షేమమే శ్రీజ డైరీ ప్రథమ లక్ష్యమని శ్రీజ డైరీ పాకాల ఏరియా మేనేజర్ ప్రకాష్ అన్నారు. పులిచెర్ల మండలం కొమ్మిరెడ్డి గారి పల్లి బి ఎం సి పరిధిలోని శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దీపావళి కానుకగా పాల మిత్రులకు మిక్సీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ ప్రకాష్ శ్రీజ డైరీ సభ్యత్వం వలన కలిగే లాభాలు పాడి పశువులకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు సూపర్వైజర్ రాజేష్ పాడిపశువుల సంరక్షణపై అవగాహన కల్పించారు. పిబిఐ. అధికారిణి నిరోషా శ్రీజ సంస్థ గ్రామ మండల స్థాయిలో చేపడుతున్న అభివృద్ధి పాలమిత్రులకు సమగ్రంగా వివరించారు. సూపర్వైజర్ మోతీ సాగర్ రెడ్డి పాల్గొన్నారు.

## కాణిపాకం స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి



**కల్లూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త** కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం మాజీ మంత్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులకు వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకి స్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాలు ఆలయ అధికారులు అందజేశారు. ఎమ్మెల్యే వెంట. పులిచెర్ల ఎంపీపీ సురేందర్ నాథ్ రెడ్డి, పులిచెర్ల వైసిపి మండల అధ్యక్షులు నాదముని రెడ్డి, నిరంజన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## కొట్టుకుపోయిన కాజ్‌వేలను పరిశీలించిన ఎమ్మెల్యే

-శాశ్వత ప్రాతిపదికన బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు



**తవణంపల్లె, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** మండలంలో గత వారం రోజులకు ముందు కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవ హించడంతో పలు ప్రాంతాల్లో నదులు, వంకలుపై పలు ప్రాంతాల్లో కొట్టుకుపోయిన కాజ్‌వేలను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అధికారులతో కలసి పరిశీలించారు. గత గురు, శుక్రవారాల్లో మండలంలో భారీ వర్షాలు కురవడంతో ఈవాగులు, వంకలు, నదులు ఉధృతంగా పొంగి ప్రవహించాయి. దీనితో మండలంలోని అరగొండ సమీపంలో బహుదానది, గొడ్డువంక, మత్యం వంకలు ఉధృతంగా ప్రవహించాయి. దీనితో అరగొండ-సరకల్లు రహదారిలో తొడతర, గాజులపల్లె వద్ద, అరగొండ-జొన్నగురుకల రహదారిలోని అరగొండ వద్ద నిర్మించిన కాజ్‌వేలు కొట్టుకుపోయాయి.అలాగే కాణిపాకం సమీపంలోని పుణ్యసముద్రం వద్ద వున్న కాజ్‌వే వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీనితో మండలంలోని పలు గ్రామాలకు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బంగారుపాళ్యం రహదారిలో మత్యం వంకపై దిగువమత్యం సమీపంలో వున్న కాజ్‌వే కూడా తెగిపోయింది. దీనితో మండలంలోని సుమారు 30 గ్రామాలకు శనివారం ఉదయం నుండి బస్సులు, భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో కొట్టుకుపోయిన కాజ్‌వేలను ఎమ్మెల్యే మురళీమోహన్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న కాజ్‌వేల స్థానంలో శాశ్వత ప్రాతిపదికన కాజ్‌వేలు నిర్మించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి సీఎంకు పంపుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట స్థానిక తహశీల్దార్ సుధాకర్, మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వర చౌదరి, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, బంగారుపాళ్యం ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, అరగొండ సింగిల్ విండో ఛైర్మన్ ఎ.రంజిత్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రవీణ, కో కన్వీనర్ కంప్యూటర్ శివ, మండల నాయకులు పైమాఘం రఘుపతి, గోపియాదవ్, దిలీప్‌లతో పాటు పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు

సదుం, అక్టోబర్ 14 ప్రభాతవార్త



సదుం గార్గేయ నది ఒడ్డున ఉన్న జై సీతారామ ఆశ్రమంలో వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి పాలు పెరుగు తేనె చందనం పసుపు కొబ్బరి నీళ్లతో అభిషేకించారు.అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సాయినాథ్ శర్మ, వెంకటరమణ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు కృష్ణా రెడ్డి,వెంకటరమణారెడ్డి, మల్ రెడ్డి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు అన్ని చర్యలు

రైతులకు సహకరించని ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు రాయితీలు బంద్

- కలెక్టర్ సుమిత్‌కుమార్



**చిత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి అవకాశాలు పెంపులో భాగంగా పరిశ్రమల స్థాపకు ముందకు వచ్చే ఔత్సామిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల శాఖ ద్వారా పూర్తి సహాయసహకారాలు అందించాలన్నారు. జిల్లాలో రైతులకు సహకరించని 3 ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రభుత్వం అందించే రాయితీలను నిలుపుదల చేయాల్సిందిగా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన నిమిత్తం వారికి అవసరమైన నైపుణ్యాలను పెంపునకు చర్యలు చేపట్టడంలో భాగంగా జిల్లాలో గల పరిశ్రమలకు అవసరమైన శిక్షణ కల్గిన సిబ్బంది నిమిత్తం సంబంధిత పరిశ్రమలకు సమన్వయం చేసుకుని డిఆర్‌డిఎ, మెప్మా, ఉద్యానశాఖ అధికారులు సమన్వయంతో నియోజకవర్గాల స్థాయిలో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారిని ఆదేశించారు. అలాగే పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూకేటాయింపులు త్వరితగతిన మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిడినెల్లూరులో పాలీహౌస్‌కు సంబంధించి త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారి సమీపంలో వున్న పరిశ్రమలకు దారి ఏర్పాటు చేసేలా నేషనల్ హైవే డిడి చర్యలు చేపట్టాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన రెవెన్యూ, అగ్నిమాపక, లేబర్, పొల్యూషనల్ కంట్రోల్ బోర్డు, చుడా తదితరాల నుండి అనుమతుల మంజూరు వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం సూరిబాబు, జెడ్‌ఎం సుబ్బారావు, ఎల్డీఎం హరీష్, ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పర్యాటక అభివృద్ధికి సమిష్టి కృషి

- కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపు

**చిత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** జిల్లా పర్యాటక అభివృద్ధికి సంబంధిత అధికారులు కృషి చేసి పర్యాటక రంగంలో జిల్లా అగ్రగామిగా నిలబెట్టడానికి సమిష్టి కృషి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జిల్లాలో పర్యాటక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలో పర్యాటక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఇందులో భాగంగా కైగల్ జలపాతం, పులిగుండు, కంగుంది, మొగిలి దేవాలయాల్లో తీసుకోవాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అలాగే ఐరాల మండలం బుగ్గమడుగు జలపాతం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను జిల్లా అటవీశాఖ అధికారి సుబ్బరాజుతో చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, ఆర్డీఓ శ్రీనివాసులు, పర్యాటక శాఖ ఆర్డీ రమణ ప్రసాద్, దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ చిట్టెమ్మ, జిల్లా పర్యాటక అధికారి నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తేదేపా కార్యకర్తలకు మిగిలింది నిరాశే

పూతలపట్టు, అక్టోబర్ 14 ప్రభాతవార్త

పూతలపట్టు మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ప్రతిపక్షంలో ఉన్న అధికారంలో ఉన్న జెండా మోసిన కార్యకర్తలకు దుఃఖం మిగులుస్తుంది. ఎలక్షన్ దగ్గరకొస్తే పార్టీ కేడర్‌ని దగ్గర తీసుకొని వారిని చుట్టూ తిప్పించుకొని తీరా అధికారం వచ్చిన తర్వాత పక్క పార్టీ నుంచి వలసలు వచ్చిన కార్యకర్తలను పట్టించుకుంటూ వారికి కావాల్సిన పనులను దగ్గరుండి చూసుకుంటున్నారని వాపోయారు. వారు ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లిన త్వరగా పనులు చేసే విధంగా అధికారులకు హుకుంజారి చేస్తూ పార్టీ కోసం పరితపించిన కార్యకర్తలకు అక్రమ కేసులు వారిపై బదలాయించుకుని కోర్టులు చుట్టూ తిరిగే కార్యకర్తలను పక్కనపెట్టి మండల నియోజకవర్గ నాయకులు జండా మోసిన కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ఒక సంవత్సరం ముందు మేమంతా గుర్తుకొస్తామని పంచాయతీలలో మరియు పల్లెటూర్లలో ఉన్న కేడర్ గుర్తొస్తుందని ఇప్పుడు తమరికి గుర్తురారని పార్టీ కోసం పరితపించే తమకు అన్యాయం జరుగుతుందని తీవ్ర అసంతృప్తికి గురి అవుతున్నారు. పార్టీ అధిష్టానం తమపై దృష్టి సారించి చిట్టచివర ఉన్న కార్యకర్తకు కూడా న్యాయం జరిగేలా చూడాలని ఆవేదన వ్యక్తం చేశారు.

## రోడ్డుపైకి దూసుకొస్తున్న పిచ్చిమొక్కలు

-పట్టించుకోని అధికారులు



***చౌడేపల్లి, అక్టోబర్ 14 ప్రభాతవార్త*** నిత్యం జనసంచారం, వాహనరాకపోకలున్న రోడ్డుపైకి చెట్లు కమ్ముకొంటున్నా అధికారులు పట్టించుకోలేదు. మండలంలోని శెట్టిపేట పంచాయతీ ఎర్రపల్లికి చౌడేపల్లి-పుంగనూరు ప్రధాన రహదారి రాణాకొత్తఇండ్ల నుంచి తారు రోడ్డు వేశారు. రోడ్డు వేసి 5యేళ్ళకు పైగా అయ్యింది. దాదాపు 2కిలోమీటర్ల మేర రోడ్డుకిరువైపులా మొక్కలు వచ్చేయడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు, విద్యార్థులు, రైతులు ఈ మార్గం నుంచి వెళుతుంటారు. అంతే కాకుండా ఎర్రపల్లి నుంచి పంజానిపల్లి, బీర్జేపల్లి, జంగాలపల్లి మీదుగా పలమనేరు ప్రధాన రహదారిని కలుపుతూ రోడ్డు మార్గముండటంతో వాహనాలు అధికంగా తిరుగుతుంటాయని గ్రామస్తులు తెలుపుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా వున్న మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

## మాతాశిశుమరణాలు అరికట్టాలి : జార్జి

చౌడేపల్లి, అక్టోబర్ 14 ప్రభాతవార్త



మాతా శిశుమరణాలను అరికట్టాలని ఆరోగ్యశాఖ జిల్లా గణాంక అధికారి జార్జి అన్నారు. మండలంలోని పంచాయతీ కేంద్రం చారాలలో గల విలేజ్ క్లినిక్‌ను సందర్శించారు. కేంద్రం పరిధిలోగల గర్భవతులు, బాలింతలను గుర్తించాలన్నారు. ముఖ్యంగా ప్రమాదస్థితిలో వున్న గర్భవతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మహిళల్లో రక్తహీనత రాకుండా అవగాహన కల్పించాలన్నారు. పౌష్టికాహారాన్ని తీసుకోవాలనీ, చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. డిపిఎం రామ్‌మోహన్, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నాగభైరవుడికి అష్టమి పంచదీపారాధన

చౌడేపల్లి, అక్టోబర్ 14 ప్రభాతవార్త



పుదిపట్ల గ్రామంలోని వైష్ణవీమాతా ఆలయంలో గల నాగభైరవుడికి అష్టమి పంచదీపారాధన పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉదయాన్నే ప్రధానార్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, అలంకరణగావించారు. అష్టమిన నాగభైరవుడికి పూజలు చేయడం వల్ల సర్ప, కుజదోషం పోతాయనీ, ముఖ్యంగా సంతానం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం దీంతో ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేసారు. ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి సేవలందించారు.

## చిత్తూరు కోర్టుకు హాజరైన తెదేపా నేతలు

కుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంకు చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు మంగళవారం చిత్తూరుకు కోర్టుకు విచారణనిమిత్తం హాజరయ్యారు. గతంలో సిఎం చంద్రబాబునాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో రామకుప్పం మండలం కొల్లుపల్లిలో జరిగిన సంఘటనల నేపథ్యంలో అప్పట్లో పలువురు తెదేపా నేతలపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసు విచారణకు దేశం నేతలు చిత్తూరు కోర్టులో హాజరయ్యారు.

## షాదీఖానా ఛైర్మన్‌ను సత్కరించిన ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల



**కుప్ప ం, అక్టోబర్ 14 ప్రభాతవార్త** కుప్పం షాదీఖానా ఛైర్మన్‌గా నియమితులైన సర్దార్ బాషా ప్రభుత్వ విప్, కడ పిఏసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనను ఈ పదవిలో నియమించడం పట్ల ఆయన ప్రభుత్వ విప్ డా॥ కంచర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్దార్ బాషాను డా॥ కంచర్ల శ్రీకాంత్ ఘనంగా సత్కరించారు. పాత షాదీఖానాతో పాటు కొత్తగా 3.85కోట్లతో నిర్మించే షాదీఖానాలను మైనార్టీలకు త్వరగా అందుబాటులో తెచ్చేలా నూతన కమిటీ కృషి చేయాలని ఆయన సూచించారు. అంతకుముందు కుప్పం, రామకుప్పం మైనార్టీ నేతలు నూతనఛైర్మన్, సభ్యులను స్థానిక షాదీమహల్‌లో సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు అబ్దుల్ గఫార్, ఫరూఖ్, ముహద్దర్, షహనాజ్, మాజీ ఛైర్మన్ అన్సర్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## టౌన్‌బ్యాంకు టీంను సత్కరించిన తెలుగుదేశం



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు కు నూతనంగా ఎంపిక కాబడిన పాలక మండలిని మంగళవారం తెలుగు దేశం పార్టీ కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ సారధ్యంలో సన్మానం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఆది నుంచి పార్టీని నమ్ముకొని పార్టీకి జవాబుదారితనంతో పని చేస్తున్న వారి సేవలను గుర్తించి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి నామినెటెడ్ పదవుల పందారం చేస్తున్నారని అన్నారు. ఎంతో కాలంగా పార్టీ కోసం పాటుపడుతున్న మైనారిటి నాయకుడు షేక్ ఖాదర్‌బాషా సేవలను గుర్తించి టౌన్‌బ్యాంకు పాలనా బాధ్యతలను అప్పంచారన్నారు. సమర్ధతను గుర్తించి పదవులను ఇంటి తలుపు తట్టి ఇస్తున్నారని వివరించారు. గతంలో ఏ నాయకుడు పార్టీ కార్యకర్తల సేవలను గుర్తించని రీతిలో సుధీర్‌రెడ్డి గుర్తిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా చైర్మెన్ ఖాదర్‌బాషా, డైరెక్టర్లు, దొరబాబు, అర్ముగం, గోవర్ధన్, రాంబాబు, అనిల్‌కుమార్‌లను దుశ్శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో విజయకుమార్ తో పాటు కంఠారమేష్, గంగల పూడి హరిలు పాల్గొన్నారు.

## 26న ప్రమాణస్వీకారానికి సన్నాహాలు?!

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి పదవి ప్రమాణ స్వీకారం ఈ నెల 26న జరపాలని జనసేన పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఈ ప్రమాణ స్వీకారానికి మంత్రి నాదేండ్ల మనోహర్ హాజరు కావచ్చునని భావిస్తున్నారు. ఈ ప్రమాణ స్వీకారానికి పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌నే ఆహ్వానించారు. కానీ వివిధ కారణాలతో ఆయన బహుశా రాకపోవచ్చునని భావిస్తున్నారు. అయితే ఓ వైపు ప్రమాణ స్వీకారానికి సిద్ధం చేసుకుంటుండగా మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట ఆరోపణలు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. తనను హత్యకేసులో ఇరికించటంలో ప్రస్తుత పార్టీ చైర్మెన్‌గా ప్రకటించిన వ్యక్తి హస్తం ఉందని ఆరోపించారు. ఈ ప్రకటన ప్రజల్లో చర్చనీయాంశానికి తెరతీసింది. కానీ ఈ నెల 26 మధ్యాహ్నం 1గంటకు సూమూహూర్తంగా నిర్ణయించినట్లు సమాచారం.

## గాయపడ్డ తమ్ముడు పరామర్శించిన చెంచయ్య



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి పట్టణ తెలుగుయువత ఉపాధ్యక్షుడు వంకాయల సిద్దులయ్య ప్రమాదానికి గురై చికిత్స పొందుతు న్నారు. మంగళవారం ఆయన్ను శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు వారి ఇంటివద్దకు వెళ్ళి పరామర్శించారు. పార్టీ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీలో ఆది నుంచి ఉన్న సిద్దులయ్య బొజ్జల కుటుంబానికి నమ్మకస్తులుగా ఉంటున్నారు. పార్టీ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనే సిద్దులయ్యకు సంబంధించి వైద్యసదుపాయాలకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆదేశించారు.

## యస్వీయూ హెల్త్ సెంటర్ ని పరిశీలించిన వి సి



**తిరుపతి విద్య, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య తాతా నరసింగరావు విశ్వ విద్యాలయంలో వివిధ సంస్థలను పరిశీలిస్తున్నారు నిన్న మధ్యాహ్నం ఆకస్మికంగా బాలుర భోజన శాలను పరిశీలించారు. అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. బియ్యం, నూనె వంటి సామగ్రి నాణ్యత పరిశీలన చేసి సంతృప్తి చెందారు. మంగళవారం విశ్వవిద్యాలయ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కేంద్ర పనితీరుపై ఆరా తీశారు. తాను కొన్ని పరీక్షలు చేయించుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. మందులను కూడా పరిశీలించారు.

## నిండ్రలో రేషన్ బియ్యం పట్టివేత



**పుత్తూరు, అక్టోబరు 14 ప్రభాతవార్త :** మండలంలోని అత్తూరు గ్రామంలో ఎస్ఐ మల్లి ఖార్జున మంగళవారం అక్రమంగా నిల్వ వుంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. నగరి మండలం దామరపాకం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ప్రతి నెల అత్తూరు గ్రామంలో ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని ఒక కేజీ 15 రూపాయలకు కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత నెల కొనుగోలు చేసిన 34 బస్తాల బియ్యాన్ని స్థానిక సచివాలయం పక్కనే నిర్మాణంలో వున్న స్థానిక వెలుగు ఆఫీస్ భవనంలో వుంచారు. సమాచారం అందుకున్న పోలీసులు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని తహశీల్దారు శేషగిరిరావుకు అప్పగించారు.

## చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రికలు ఆవిష్కరణ

**పుత్తూరు రూరల్, అక్టోబరు 14 ప్రభాతవార్త :**



జన విజ్ఞాన వేదిక నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలకు చెందిన గోడ పత్రికలను మంగళవారం పట్టణంలో డిప్యూటీ డిఇఒ మహేశ్వరరావు తదితర విద్యాశాఖాధికారులు ఆవిష్కరించారు. ఈ పోటీలు ఈ నెల 18న పాఠశాల స్థాయిలోనూ, నవంబరు ఒకటో తేదీన మండల స్థాయిలోనూ, నవంబరు 23న జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన వారు రాష్ట్ర స్థాయిలో డిసెంబరు 12, 13, 14 తేదీల్లో పోటీ పడతారు. విజేతలకు జన విజ్ఞాన వేదిక ద్వారా మొదటి బహుమతి రూ. 50,000 వేలతో పాటు సైన్స్ పరికరాలు అందిస్తారు. రెండో స్థానంలో నిలిచే వారికి రూ. 40,000 వేలు, మూడో బహుమతి రూ. 30,000 వేలతో పాటు సైన్స్ పరికరాలు ప్రదానం చేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు వేదిక పుత్తూరు డివిజన్ కన్వీనర్ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి విజయ నాగు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, యుటిఎఫ్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, రాష్ట్ర నాయకుడు దాసరి మునెయ్య, ఉపాధ్యాయులు మురళి, నరేష్, భాస్కర్, మునిరత్నం, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లకు శిక్షణ

**పుత్తూరు రూరల్, అక్టోబరు 14 ప్రభాతవార్త :**



స్థానిక ఎండిపిఒ ఆఫీసులో మంగళవారం పుత్తూరు, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల సర్పంచ్‌లకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లోని (ఎస్‌డిజి) 9 అంశాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపిడిఒ జి.శ్రీదేవి మాట్లాడుతూ ఆరోగ్యం, విద్య, నీటి వనరులు, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, ఆర్థికాభివృద్ధి, లింగ సమానత్వం, మౌలిక వసతులు, శాంతి – న్యాయం వంటి 9 లక్ష్యాలను సర్పంచ్‌లు తమ గ్రామాల్లో ఎలా అమలు చేయాలో వివరించారు. గ్రామీణాభివృద్ధిలో ఎస్‌డిజిల పాత్ర చాలా ముఖ్యమన్నారు. ఈ అంశాల్లో శిక్షణ పొందిన సర్పంచ్‌లు తమ పంచాయతీల్లోని గ్రామాల అభివృద్ధిలో వ్యూహాత్మక దృష్టిలో పనిచేసే ధృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ బి.దేవిక, శిక్షకులు డి.తేజ, వినోద్‌కుమార్, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## తపాలా ఖాతాదారులకు ఆరోగ్య పాలసీలు

**పుత్తూరు రూరల్, అక్టోబరు 14 ప్రభాతవార్త :** తపాలా ఖాతాదారులకు మాత్రమే తక్కువ ప్రీమియంతో ఆరోగ్య, క్యాన్సర్, ప్రమాద బీమా పాలసీలు అందిస్తున్నట్టు పుత్తూరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఐపిఒ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనపరిచిన తపాలా సిబ్బందికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి రూ. 350 నుంచి 800 రూపాయల ప్రీమియంతో 5 నుంచి 15 లక్షల వరకూ ఆరోగ్య, ప్రమాద బీమాలను తపాలా శాఖ అందిస్తోందని తెలిపారు. ఐపిపిబి తిరుపతి బ్రాంచ్ మేనేజర్ శైలేష్ మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేకంగా నారీ సురక్ష హెల్త్ పాలసీ ద్వారా క్యాన్సర్ చికిత్సకు ఒక లక్ష రూపాయల కవరేజీని రాయల్ సుందరం ఫైనాన్స్ కంపెనీ అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సుందరం ఫైనాన్స్ ప్రతినిధి ధనరాజ్, మెయిల్ ఓవర్సీయర్లు మురళి, సత్యమూర్తి, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

## అరకు కాఫీ ఆర్గానిక్ ఇండియా

**తిరుపతి, అక్టోబర్ 14ప్రభాతవార్త:** టాటా ఉత్పత్తి ఆర్గానిక్ ఇండియా అరకు ఇన్‌స్టంట్ కాఫీనివిడుదలచేసింది. వందశాతం ప్రీమియం అరబికా కాఫీతో తయారుచేయబడిన సర్టిఫైడ్ ఆర్గానిక్ కాఫీ మిశ్రమం ఇది. అత్యంత సహజమైన అరకుకాఫీ వ్యాలీ భూముల నుండి తీసుకోబడిన ఉత్పత్తి. నైతికంగా సాగుచేసిన సేంద్రీయ పదార్థాల పర్యావరణం ,స్థానిక సమాజాలసాధికారత పట్ల బ్రాండ్ అచంచలమైన నిబద్ధతకు ఆవిష్కరణి అని ప్రతినిధి ప్రసాద్‌గుప్తతెలిపారు. ఈ ఉత్పత్తి కాఫీప్రియులకు అరకు లోయరైతుల ప్రత్యేక బ్రాండ్‌అన్నారు. గిరిజన రైతుల వ్యవసాయ వారసత్వాన్ని ప్రోత్సహించడం, సంరక్షించడం జరుగుతుందన్నారు.

## ఇంటర్ కాలేజియేట్ పోటీలను ప్రారంభించిన వీసీ



**తిరుపతి విద్య, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో 2025–28 విద్యాసంవత్సరానికి సంబంధించి వర్సిటీ ఇంటర్ కాలేజియేట్ ఉమెన్ గేమ్స్ పోటీలనూ వీసీ నర్సింగరావు ప్రారంభించారు. మంగళవారం వర్సిటీలో ప్రారంభమైన ఈ టోర్నమెంటుకు వర్సిటీ పరిధి లోని 30కళాశాల నుంచి సుమారు 300మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుధారాణి, ఫిజికల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం శివశంకర్ రెడ్డి, క్రీడాకారులు, కోచ్లు పాల్గొన్నారు.

## జాతీయ సెమినార్ బ్రోచర్ విడుదల



**తిరుపతి విద్య, అక్టోబర్ 14 ప్రభాత వార్త:** స్థానిక అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల వేదికగా డిసెంబర్ 13వ తేదీ నుంచి రెండు రోజుల పాటు విద్యార్థుల నాలెడ్జ్ షేరింగ్, నూతన అంశాలపై అవగాన వంటి అంశాలపై జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్ ను కళాశాల చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి మంగళవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని నలుమూలల నుంచి ఎంతో మంది లా విద్యార్థులు, పరిశోధకలు జాతీయ సదస్సుకు హాజరుకానున్నారని అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భావి భారత విద్యార్థులకు ఇలాంటి సదస్సులు మరింత జ్ఞానాన్ని అందిస్తాయని తెలిపారు. ప్రిన్సిపల్ బిజయ కుమార్ బెహెరా, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ఉపాధ్యక్షులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కందాడు పంచాయతీలో యూరియా కార్డులు పంపిణి



**శ్రీకాళహస్తి రూరల్, అక్టోబర్ 14 ప్రభాతవార్త** ఏర్పేడు మండలం కందాడ పంచాయతీలో మంగళవారం యూరియా కార్డులను పంపిణి చేసారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు పర్యవేక్షణలో కార్డుల పంపిణి కార్యక్రమాలను చేపట్టారు. పంచాయతీలోని ముసలిపేడు, సరస్వతి కండ్రిగ, కందాడ పంచాయతీల్లోని రైతులకు కార్డులను పంపిణి చేసారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రైతులు యూరియా కోసం తల్లడిల్లుతున్నట్లు వివిధ రాజకీయ పక్షాలు ఆందోళనలు చేస్తున్నారు. అయితే యూరియాకు సంబందించి రైతు సేవా కకేంద్రాల ద్వారా అందించుటకు వ్యవసాయశాఖ స్పందించింది. ఈ కార్డుల పంపిణి కార్యక్రమాల్లో వ్యవసాయాధికారి కేశినేని సుబ్రమణ్యం, అంకయ్య, డాక్టర్ మునెయ్య,, జయప్రకాష్ నారాయణ, బాలాజి, మనోజ్, తేజ, నరేంద్ర, సత్యం, మునేశ్వర్, హరి, చినబత్తిరెడ్డి, బాబునేఆయుడు, రాజగోపాల్, సుధాకర్ నాయుడు, రమేష్‌నాయుడు, చెంగర్‌రాయులు, మధు, మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో ఏపి ఎన్‌జిఓ అధ్యక్షులు

**శ్రీకాళహస్తి ,అక్టోబర్ 14 ప్రభాతవార్త**



రాష్ట్ర ఎన్‌జిఓ అధ్యక్షులు ఏ.విద్యాసాగర్ మంగళవారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకొని పూజలు జరిపించుకున్నారు. వారికి ఆలయ పరిపాలనా భవనం వద్ద ఎపిఎన్‌జిఓ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి చెంచురత్నం యాదవ్ సారథ్యంలో ఉద్యోగ సంఘాలు ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఎఇఓలు మోహన్, విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్ వేదపండితులచే స్వాగతం పలికారు. ఆలయంలోపల ఏర్పాట్లును ఆలయ ఇన్సెపెక్టర్లు వెంకటస్వామి, సుదర్శనం నాయుడులు పర్యవేక్షించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులతో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం గుర్తించి రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకురావాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన సంఘానికి రాష్ట్ర అధ్యక్షులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి ఎపిఎన్‌జిఓ అధ్యక్షులు, ఉమ్మడి చిత్తూరుజిల్లా ప్రధాన కార్యదర్శి చెంచురత్నం యాదవ్, కార్యదర్శి బాలచంద్రయ్య, చిత్తూరుజిల్లా అధ్యక్షులు రాఘవులు, కార్యదర్శి రమేష్, తిరుపతిజిల్లా అడహాక్ కమిటి చైర్మెన్ సురేష్‌బాబు, కోశాధికారి లలిత్‌కుమార్, వైస్ చైర్మెన్ భాస్కర్, సంఘ సభ్యులు చంద్రకాంత్, గణేష్‌లు పాల్గొన్నారు.

## కాలువలో మట్టితీసి రోడ్డుపై పోసారు

మసి బారిన వీధి

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పురపాలక సంఘ పని తీరు రోజు రోజుకు తీసికట్టుగా మారింది. మున్సిపాలిటిలో పారిశుద్ధ్య శాఖలో సిబ్బంది కొరత ఉంది. అయితే పనుల నిర్వహణలో కూడా జవాబు దారి తనం లేకుండా వ్యవహారిస్తున్నారనే విమర్శలు బాహాటంగా ఉన్నాయి. ఇటీవల శ్రీకాళహస్తి ఆర్‌టిసి బస్టాండు నుంచి మరాఠిపాళెంకు వెళ్ళె దారిలో డాక్టర్ బత్తెయ్యనాయుడు క్లినిక్‌కు పక్కన మరాఠిపాళెం వీధి ప్రధాన కాలువలో ఏళ్ళ నుంచి పేరుకుపోయిన సిల్టును తొలగించారు. మున్సిపల్ పారిశుద్ధ్య శాఖ చొరవను అప్పటిలో ప్రజలు ప్రశంసించారు. కానీ కాలువల్లోంచి తీసిన మట్టిని రోడ్డు మీద పోసి చేతులు దులుపుకున్నారు. ఈ సిల్టు ఎండకు ఎండి, వానకు తడిసి చివరకు మసిగా మారింది. ఈ మసి రోడ్డంతా అల్లుకుంది. ఈ సిల్టు నుంచి పురుగులు ఉత్పత్తి అయి ఇళ్ళలోకి వస్తున్నాయి. దోమల ఉత్పత్తిగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం నీడ వీడి కార్యాచరణకు చొరవ చూపాలన్నారు.

## ఓట్ చోర్ : గద్దెఛోడ్ సంతకాల సేకరణ

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త**



పిసిసి అధ్యక్షులు షర్మిలారెడ్డి పిలుపు మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తలపా దామోదర్‌రెడ్డి సారధ్యంలో శ్రీకాళహస్తిలో 'ఓట్ చోర్ గద్దెఛోడ్' కు సంతకాల సేకరణ కార్యక్రమాలను చేపట్టారు. మంగళవారం చేపట్టిన కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షులు బాలగురువం బాబు ముఖ్యఅతిదిగా హాజరయ్యారు. శ్రీకాళహస్తి మండలం వాంపల్లి గ్రామంలో పాల్గొన్నారు. గతంలో పట్టణలోని సంతకాల సేకరణ గావించిన వారు ప్రస్తుతం గ్రామాల్లో వెళ్ళి ప్రజలకు ఎన్నికల్లో జరిగిన మోసాలకు సంబందించి వివరిస్తూ సంతకాల సేవకరణ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా తలపా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ భారత దేశంలో ప్రజాస్వామ్యం వర్థిల్లాలి అంటే ఎన్నికల కమిషన్ ప్రధాన భూమిక వహిస్తుందన్నారు. అంతటి సంస్థకు స్వయం పతి పత్తి కల్గిన సంస్థలు ఓట్ల అవకతవకలకు పాల్పడుతుంటే భారత దేశం అభాసుపాల్జేస్తుందన్నారు. రాబోవు రోజుల్లో ఇటువంటి అవకతవకలు జగరకుండా ప్రజల్లో చైతన్యం నింపటానికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివచింరాడు. ఈ కార్యక్రమాల్లో కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్థన్‌రెడ్డి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోని, నవీన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పరశురామేశ్వరాలయ అభివృద్ధికి సహాకరించండి

కలెక్టర్‌ను కలసిన నాయకులు

**శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 14 ప్రభాతవార్త** గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని



ఆలయ అభివృద్ధికి సహాకరించాలని మంగళవారం మాజీ చైర్మెన్ బత్తలగిరి నాయుడు, ఆలయ కార్యనిర్వ హణాధికారి రామచంద్రారెడ్డిలు జిల్లా కలెక్టర్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. ప్రపంచ ప్రసిద్ది చెందిన ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసి పరశు రామేశ్వరాలయాన్ని పురావస్తు శాఖ పర్యవేక్షి స్తుందన్నారు. ఆలయానికి వచ్చే విఐపిల సంఖ్య పెరిగిందని అలాగే ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న పథకానికి భక్తుల నుంచి విరివిగా విరాళాలు అందుతున్నాయని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్‌ను వివరించారు. బైపాస్‌రోడ్డుకు సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే అన్నదానంకు ప్రస్తుతం తాత్కాలిక షెడ్‌లో నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయ నిర్వాహకుల అభ్యర్థనను విన్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ త్వరలోనే అంచనా ప్రతిపాదనలు తయారు చేసి ఆర్కియాలజి శాఖకు ప్రతిపాదనలు పంపి జనవరిలో పనులు ప్రారంభించుటకు ప్రయత్నిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చినట్లు బత్తల గిరి నాయుడు వివరించారు.

## జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు సన్మానం

**తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 14 ప్రభాతవార్త**



జిల్లా నుండి బదిలీపై వెళ్తున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ , గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు జరిగిన వీడ్కోలు సమావేశంలో వారిని సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, డిఆర్ఓ నరసింహులు, రెవిన్యూ అసోసియేషన్ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నిబంధనలకు లోబడి బాణాసంచా అమ్మకాలు జరపాలి



**పాకాల, అక్టోబర్ 14, ప్రభాతవార్త** పాకాల మండలం అగ్నిమాపక శాఖ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నాగేశ్వర రెడ్డి పాకాల మండల ప్రజలకు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకాల అగ్నిమాపక శాఖ పరిధిలో ఇప్పటివరకు నలుగురు తాత్కాలిక టపాకాయల అమ్మకానికి దరఖాస్తు కొరకు సంప్రదించి ఉన్నారని కానీ ఇప్పటి వరకు ఎవరికీ పర్మిషన్ ఇవ్వలేదు అని నిబంధనల ప్రకారమే వారికి అనుమతి ఇవ్వబడుతుంది అని బాణాసంచి అమ్మకపుదారులు వారికి కేటాయించిన స్థలములోనే తాత్కాలిక రేకుల షెడ్లు వేసుకోవాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే స్పందించడం కొరకు నీటి ట్యాంకర్లు ఇసుక లాంటి అగ్ని నిరోధక సాధనాలను అందుబాటులో ఉంచుకొని అమ్మకాలు జరపాలన్నారు. తాము నిర్దేశించిన అమ్మకపు దారుల నుంచి మాత్రమే ప్రజలు టపాకాయలు కొనుగోలు చేయాలని లైసెన్సులు లేని అమ్మకపు దారుల నుంచి టపాకాయలు కొనుగోలు చేయరాదన్నారు. పిల్లలు బాణసంచా కాల్చేటప్పుడు పెద్దవారి పర్యవేక్షణలో మాత్రమే బాణసంచా కాల్చే విధంగా చర్యలు తీసుకోవాలని దగ్గరలో నీటిని అందుబాటులో ఉంచుకొని బాణసంచా కాల్చాలని ఈ సందర్భంగా వారు ప్రజలకు జాగ్రత్తలు సూచించారు.

## జిల్లా జర్నలిస్ట్ క్రికెట్ టీంకు కలెక్టర్ అభినందనలు



**తిరుపతి క్రీడ, అక్టోబర్ 14, ప్రభాతవార్త:** అనంతపురం అంతర్జాతీయ ఆర్డిటి స్టేడియం వేదికగా అక్టోబర్ 5,6,7,8 తేదీలలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్(జేశాప్) ఆధ్వర్యంలో నిర్వహించిన జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ 2025 టోర్నీలో తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లా జట్టు ఛాంపియన్‌గా నిలిచిన సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అభినందనలు తెలియజేశారు. మంగళవారం జిల్లా క్రికెట్ జట్టు కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో ఛాంపియన్స్‌గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. ముందు ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా జట్టుకు తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తామని తెలిపారు. కలెక్టర్ కలిసిన వారిలో జేశాప్ జిల్లా అధ్యక్షులు విజయ యాదవ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, కోశాధికారి నరేష్ రెడ్డి, కెప్టెన్ పులుగూరు శ్రీనివాసులు, క్రీడాకారులు కామేశ్వరయ్య, చిన్నబాబు, వెంకటేష్, మనోహర్, జగదీష్, సుబ్రహ్మణ్యం, సురేష్, ప్రతాప్, నరేష్, మదిఅలగన్, మునిశేఖర్, సతీష్, శ్రీనివాసులు, సాయి తదితరులు ఉన్నారు.

## అండర్19 విభాగం స్కూల్ గేమ్స్‌లో జూడో జిల్లా జట్టు ఎంపిక పోటీలు



**తిరుపతి క్రీడ, అక్టోబర్ 14, ప్రభాతవార్త** తిరుపతి శ్రీనివాస క్రీడా ప్రాంగణం నందు బాలబాలికల జూడో జిల్లా జెట్టు ఎంపిక పోటీలు జరిగాయి. ఈ క్రీడా పోటీల్లో బాలబాలికలు అద్భుత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా జట్టుకి ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అండర్ 19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ డాక్టర్ బాబు, అండర్ 14,17 తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీస్ కిషోర్ కుమార్, భార్గవి, డిఎస్‌డిఓ శశిధర్, పీడీలు చంద్రశేఖర్ రాజు, శ్రీధర్, గోపి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పతాంగేల్‌లో వ్యాధుల భారిన ప్రజలు, చిన్నారులు

ఆందోళనకు సిద్ధమంటున్న సిపిఐ

**నారాయణవనం, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** మండలంలోని కశింమిట్ట పంచాయతీ ఇప్పతాంగేల్ గ్రామంలో గత 20 రోజులుగా పారిశుద్ధ్య లోపంతో పెద్ద, చిన్న అనే తేడా లేకుండా వ్యాధుల భారిన పడుతున్నట్టు సిపిఐ పుత్తూరు నాయకులు మహేష్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వైరల్ ఫీవర్‌తో బాధపడుతుంటే సంబందించి వైద్యాధికారులు, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమైన విషయమన్నారు. మురికికాలువలను శుభ్రం చేయడం గానీ, నీళ్ల ట్యాంకులను సైతం శుభ్రం చేయకపోవడంతోనే ఈ సమస్య వచ్చిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

## డాక్యుమెంట్ రైటర్లు దళారులా? : కేశవులు



***రేణిగుంట, అక్టోబర్ 14 ప్రభాతవార్త*** డాక్యుమెంట్ రైటర్లను దళారులని అటెండర్ తిరుమలేష్ కించపరచడం హేయమైన చర్యగా రాష్ట్ర డాక్యుమెంట్ రైటర్ల స్టీరింగ్ కమిటీ మెంబరు, జిల్లా అధ్యక్షుడు కేశవులు అన్నారు. రేణిగుంట సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద మంగళవారం అటెండర్ తిరుమలేష్ ప్రవర్తనకు వ్యతిరేకంగా డాక్యుమెంట్ రైటర్లు నిరసన వ్యక్తం చేస్తూ సబ్ రిజిస్టర్ ఆనంద రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్ల జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర స్టీరింగ్ కమిటీ మెంబర్ కేశవులు విలేకరులతో మాట్లాడుతూ అటెండర్ తిరుమలేష్ ప్రవర్తన అభ్యంతరకరంగా ఉందని అన్నారు. డాక్యుమెంట్ రైటర్లు సబ్ రిజిస్టర్ కార్యాలయంలోకి వెళ్లడం తప్పా అని ప్రశ్నించారు. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేయించుకునే వారికి అన్ని విధాల సహకరించి స్లాట్ బుకింగ్, డాక్యుమెంట్లను రూపొందించి పిడిఎఫ్లు చేసి వారి వద్ద నామ మాత్రపు రుసుము వసూలు చేస్తున్నామే తప్ప ఎవరి వద్ద అధిక వసూళ్లకు పాల్పడడం లేదని అన్నారు. కోర్టు ఆర్డర్ ప్రకారమే తాము రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని న్యాయస్థానాలకు లేని ఇబ్బంది అటెండర్ కి ఎందుకని సూటిగా ప్రశ్నించారు. డాక్యుమెంట్ రైటర్లను అగౌరవపర్చడం మంచి పద్ధతి కాదన్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అటెండర్ పై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు దాము, లక్ష్మీనారాయణ, భాస్కరయ్య, రమేష్, రూపేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు..

## గూగుల్ వైజాగ్ రావడం మంత్రి లోకేష్ నిరంతర కృషి

– రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్



**తిరుపతి హెల్త్, అక్టోబర్ 14, ప్రభాతవార్త:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గూగుల్ సంస్థ వైజాగ్‌లో స్థాపించడం వెనుక మంత్రి నారా లోకేష్ బాబు నిరంతర కృషి ఉందని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ తెలియజేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరసింహ యాదవ్ మాట్లాడారు. గూగుల్ సంస్థ వైజాగ్‌లో నెలకొల్పడం వలన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు మెండుగా వస్తాయన్నారు. మంత్రి నారా లోకేష్ బాబు యువగళాం పాదయాత్రలో రాష్ట్ర ప్రజలకు, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం నారా చంద్రబాబు నాయుడుకి, మంత్రి నారా లోకేష్ బాబుకి దక్కుతుందన్నారు. పధానమంత్రి నరేంద్ర మోడీ ఇంటికి వెళ్లి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై చంద్రబాబు, లోకేష్ చర్చించడం అభినందనీయమన్నారు. దేశంలో జీఎస్టీ తగ్గడం వలన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గాయని ఆ ఘనత సీఎం చంద్రబాబు నాయుడు కే దక్కుతుందన్నారు. మంత్రి నారా లోకేష్ బాబు చదువుతో రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలను ఇచ్చిన ఘనత మంత్రి నారా లోకేష్ బాబుకి దక్కిందన్నారు. కూటమి ఆదేశాల మేరకు తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి శ్రీనివాస మంగాపురం నుండి శ్రీకాళహస్తి వరకు స్వర్ణ ముఖ్య నది పరివాహ ప్రాంతాన్ని సుందర ప్రాంతంగా తీర్చిదిద్దాలని అనుకోవడం రాష్ట్ర అభివృద్ధిలో భాగమన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహ యాదవ్‌తో పాటు రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్ర కోటి సదాశివం, శ్రీ గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, టిడిపి నేతలు రవిశంకర్ యాదవ్, శ్రీరాములు, రామారావు, చెంగయ్య పాల్గొన్నారు.

## 17 నుండి కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు

**చంద్రగిరి, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామివారి పవిత్రోత్సవాలు ఈ నెల 17 నుండి 19 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 16న పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 17న ఉదయం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, సాయంత్రం 6.30 గంటలకు పవిత్ర ప్రతిష్ట నిర్వహిస్తారు. 18న మధ్యాహ్నం 12 గంటలకు పవిత్ర సమర్పణ, 19న రాత్రి 7 గంటలకు పూర్ణాహుతి, వైదిక కార్యక్రమాలతో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఆలయంలో ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవ నిర్వహిస్తారు. ఈ సేవలో పాల్గొనదలచిన భక్తులు ఇద్దరికి రూ.516/–లు చెల్లించి పాల్గొనవచ్చును. పవిత్రోత్సవాల నేపథ్యంలో 16న తిరుప్పావడ సేవను, 17 నుండి 19 వరకు నిత్య కల్యాణోత్సవంను రద్దు చేశారు.

## పీఎం సూర్యఘర్ సక్సెస్ చేయాలి

– ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



***తిరుపతి విద్య, అక్టోబర్ 14 ప్రభాతవార్త:*** ఏపీ సద రన్ డిస్కం నూతన సిఎండి ఎల్. శివ శంకర్ ను మంగళవారం మధ్యాహ్నం మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భేటీ అయ్యారు. ఈ భేటీలో మెరుగైన విద్యుత్ అందించేందుకు అవసరమైన విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుపై ఇరువురు చర్చించారు. అలాగే అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ నెట్వర్క్ అమలుపై చర్చించారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు వినియోగించుకునేలా ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సిఎండి శివ శంకర్ ను కోరారు. సోలార్ విద్యుత్ వినియోగం పెంచడం ప్రభుత్వ లక్ష్యమని తప్పనిసరిగా పీఎం సూర్యఘర్ పథకాన్ని సక్సెస్ చేసేందుకు ప్రయత్నిస్తామని సిఎండి శివ శంకర్ తెలిపారు.

## ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి



బాలాయపల్లి, అక్టోబర్ 14 ప్రభాతవార్త : నారాయణ ఆస్పత్రిలో పలు వ్యాదులకు అత్యాధునిక పరికరాలతో వైద్యం అందిస్తున్నట్లు వైద్యాధికారిణి డాక్టర్ కె.కృష్ణప్రియ, డా.నీలిమ తెలిపారు. మండల కేంద్రమైన బాలాయపల్లిలో నారాయణ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో డాక్టర్లు కె.కృష్ణప్రియ, డా.నీలిమలు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. రోగులకు బిపి, షుగర్, ఇంకా పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నారాయణ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా నారాయణ హాస్పిటల్ ఆప్తోలోజి డాక్టర్ కె.కృష్ణప్రియ మాట్లాడుతూ ఉచిత బస్సు గ్రామాలకే వచ్చి రోగులను చింతారెడ్డిపాలెం నెల్లూరు నారాయణ ఆసుపత్రికి తీసుకొని వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, శస్త్ర చికిత్సలు, ఉచిత భోజనం వసతి కల్పించి తిరిగి క్షేమంగా రోగుల ఇంటి వద్దకే చేరుస్తామని ఆమె తెలిపారు. ఆసుపత్రికి వచ్చేటప్పుడు ఆధార్, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు, మొబైల్ ఫోన్, బ్యాంకు పాసుబుక్ తీసుకురావాలని సూచించారు.

# గూడూరు డివిజన్

## భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం : తహాశీల్దార్



వాకాడు, అక్టోబర్ 14 ప్రభాతవార్త: మండలంలోని రెడ్డిపాలెం బిట్టు వన్, బాలాజీ నగర్ గ్రామాల మహిళలు మంగళవారం ప్రభుత్వ భూమి భూ ఆక్రమణ జరుగుతుందని వినతి పత్రం అంద చేశారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ సయ్యద్ ఇక్బాల్‌తో గ్రామస్తులు మాట్లాడుతూ ఆ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రభుత్వ భూములను కొందరు దురాక్రమణ చేస్తున్నారని తెలిపారు. ఎన్నో ఏళ్లగా సొంత భూమి లేక కూలీ పనులు చేసుకుని చూస్తున్నామని బాధ ఆవేదన వ్యక్తం చేశారు. మా ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి పంపిణీ చేయాలని కోరారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తహాశీల్దా తెలిపారు.

## నకిలీ మద్యం అమ్మించిన పాపం వైసిపిదే : ఎమ్మెల్యే




వెంకటగిరి, అక్టోబర్ 14 ప్రభాత వార్త : రాష్ట్రంలో నకిలీ మద్యం ను వైసిపి ప్రభుత్వంలో విక్రయించారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామ కృష్ణ తెలిపారు. వెంకట గిరిలో ఆయన నివాస గృహంలో విలేక రుల సమావేశం నిర్వహించారు. నకిలీ మద్యం త్రాగడం వల్ల గత ప్రభుత్వంలో అనేక మంది చనిపోయినట్లు తెలిపారు. నకిలీ మద్యం తయారుచేసి విక్రయించినట్లు తెలిపారు. ఇప్పుడు వైసిపి వారు చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు నకిలీ మద్యం వికరిస్తున్నట్లు అబద్ధపు ప్రచారం చేస్తూ ధర్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పేదల కోసం అన్ని రకాల మందులు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. గుండెకు సంబంధించిన ఇంజక్షన్ కూడా ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రులలో వైద్యుల కొరత కూడా లేదన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ రాజేశ్వర రావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు మురళి గౌడ్, నాయకులు ఆనంద్, నరసింహులు, భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## 17న ప్రత్యేక విద్యుత్ అదాలత్

పెళ్లకూరు అక్టోబర్ 14 ప్రభాతవార్త : నాయుడుపేట, సూళ్లూరుపేట డివిజన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారుల కోసం ఈ నెల 17వ తేదీ సూళ్లూరుపేట లోని సత్య సాయి ఫంక్షన్ హాల్ నందు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నాయుడుపేట ఆపరేషన్ డివిజన్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. దీనిలో భాగంగా పెళ్లకూరు మండలంలోని అన్ని సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల విద్యుత్ వినియోగదారులు చాలా కాలంగా పరిష్కారం కానీ తమ సమస్యలను వ్రాత పూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

## కొలువుదీరిన కొత్త ఉపాధ్యాయులు

వాకాడు, అక్టోబర్ 14 ప్రభాతవార్త: మండలంలోని 25 మంది కొత్తగా ఉపాధ్యాయులు విధుల్లోకి చేరినట్లు ఎంఈఓ ఆనంద్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ హైస్కూల్‌కు 14 మంది ఉపాధ్యాయులు, ఐదు మంది పీడీలు, ఎస్‌జిటి నలుగురు, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలు ఇద్దరూ విధిలోకి జాయిన్ అయినట్లు ఎంఈఓ ఆనంద్ తెలిపారు. మండలంలోని హైస్కూల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు భర్తీ కొరత తీరిందన్నారు, ప్రైమరీ పాఠశాలలు, ఎస్‌జిటిలు కొరత తీరాల్సి ఉందని అన్నారు.

## ఆదాయ వనరులు పెంపుదలపై శిక్షణ



వాకాడు, అక్టోబర్ 14 ప్రభాతవార్త: మండలంలోని గ్రామపంచాయతీలలో ఆదాయ వనరులు పెంపుదలపై ఎంపీడీవో సాయిప్రసాద్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో స్త్రీ శక్తి భవనంలో మంగళవారం పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచన ప్రకారం పంచాయతీలో ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులు తక్కువగా ఉన్న దృష్ట్యా, పంచాయతీ పరిధిలో ఉన్న ఆదాయ వనరులను పెంపొందించుకొని అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ శిక్షణాలో రిసోర్స్ పర్సన్స్ చిన్నయ్య మాట్లాడుతూ ఆదాయ వనరులను ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలి, ఎలా గుర్తించాలి, వేటి ద్వారా ఆర్థిక వనరులు సమకూర్చుకోవచ్చు అనే తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఈఓపిఆర్‌డి సురేష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి, సర్పంచ్లు సిద్ధారెడ్డి మధుసూదన్ రెడ్డి, అనిల్‌రెడ్డి, మల్లాపు నాగరాజు, కిషోర్ కుమార్, బండి వెంకట రత్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలి : ఎంపీడీవో

శ్రీసిటీ (తడ), అక్టోబర్ 14 ప్రభాతవార్త : మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో మంగళవారం మండల అభివృద్ధి అధికారి శేఖర్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామపంచాయతీలకు గ్రామాలలో ఉండే వనరులు ఉపయోగించుకొని అదనపు ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. ఇంటి పన్ను ద్వారా నీటి పన్ను ద్వారా పంచాయితీ లైసెన్సులు ద్వారా గ్రామాలలో చేపల చెరువు వేలాలు నిర్వహించడం ద్వారా చెత్తతో సంపద సృష్టించు కేంద్రాల ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఎంపీడీవో సర్పంచులకు తెలియజేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల అభివృద్ధి అధికారి శేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు.

## పేద మహిళలకు చీరలు పంపిణీ



సుళ్ళూరుపేట, అక్టోబర్ 14 ప్రభాతవార్త : శ్రీచెంగాళమ్మ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం బాబుజి కాలనీలో పేద మహిళలకు ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పిట్ల సుబ్రహ్మణ్యం, కె.శ్రీధర్,వెంకటేష్ యాదవ్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో 21న కేదారి గౌరీ వ్రతం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త : దీపావళి సందర్భంగా శ్రీకాళహస్తీశ్వ రాలయంలో నిర్వహించే కేదారి గౌరీ వ్రతాన్ని ఈ నెల 21 మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పర్వదినం ఘడియలు రెండు రోజులు రావడంతో, లక్ష్మీపూజ ఏ రోజు చేయాలని భక్తులు సందిగ్ధంలో వున్న దృష్ట్యా ఆలయాధికారులు 21వ తేదీనే గౌరీవ్రతం అని, రు.500 రాహుకేతు మండపంలో నిర్వహించున్నట్లు వివరించారు. అలాగే కార్తిక మాసం ఈనెల 22వ తేదీ నుండి ప్రారంభం కానున్న సందర్భంగా 17వ తేదీన ఉద్యోగుల సమావేశం పరిపాలనా భవనములోని సమావేశం మందిరం నందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశానికి కార్తికమాసంలో ప్రత్యేక విధులు కేటాయించిన సిబ్బంది, ప్రధాన అర్చకులు, సంబంధిత విభాగాల ఉద్యోగులు అందరూ హాజరు కావాలని తెలియజేశారు.

## కార్పెంటర్‌కి రు.15వేలు ఆర్థిక సహాయం



తిరుపతిహెల్త్, అక్టోబర్ 14 ప్రభాతవార్త : ప్రమాదవశాత్తు కాలు విరిగి చికిత్స పొందుతున్న కార్పెంటర్ మహ్మద్ భాషాకు తిరుపతి కార్పెంటర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రు.15వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెవి రత్నం ఆచారి, ఎలిగారం కృపాచారి మాట్లాడుతూ కార్పెంట్ వృత్తితో జీవనాన్ని సాగిస్తున్న భాషాకు తమ వంతు ఆర్థిక సాయం చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో సంక్షేమ సంఘం కోశాధికారి జి.దేవరాజు పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన బెల్జియం కాన్సుల్ జనరల్

శ్రీసిటీ,అక్టోబర్ 14 ప్రభాతవార్త : పారిశ్రామిక వసతుల పట్ల ప్రశంస శ్రీసిటీ,ఈ ప్రాంతంలో బెల్జియన్ పారిశ్రామిక ప్రయోజనాల చర్చల నిమిత్తం ముంబైలోని బెల్జియం కాన్సుల్ జనరల్ ఫ్రాంక్ గీర్కెన్స్ మంగళవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ఇక్కడ పెట్టుబడి అవకాశాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, వ్యాపార అనుకూల వాతావరణం గురించి వివరించారు. పర్యటనలో భాగంగా ఆయన శ్రీసిటీ పరిసరాలను సందర్శించారు. శ్రీసిటీ వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కాన్సుల్ జనరల్, విదేశీ పెట్టుబడిదారులకు ఇది అత్యంత అనువైన ప్రదేశం అని వ్యాఖ్యానించారు. వెర్మీరిన్ సంస్థ అధునాతన వీల్‌చైర్లు తయారు చేయడం ద్వారా బెల్జియం పరిశ్రమలకు శ్రీసిటీలో పునాది వేసిందని ప్రశంసించారు. వెర్మీరిన్ సంస్థకు శ్రీసిటీ మద్దతును అభినందిస్తూ, మరిన్ని బెల్జియన్ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయి పునరావాస పరికరాల తయారీ సంస్థ వెర్మీరిన్ పరిశ్రమ శ్రీసిటీలో ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్నడాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, గ్లోబల్ భాగస్వామ్యాలను ప్రోత్సహించాలనే శ్రీసిటీ నిబద్ధతను కాన్సుల్ జనరల్ సందర్శన ప్రతిబింభిస్తుందని తెలిపారు. అనంతరం వెర్మీరెన్ కంపెనీని ఫ్రాంక్ గీర్కెన్స్ సందర్శించి, అక్కడ ఉత్పత్తులు, ఇతర పారిశ్రామిక కార్యకలాపాలను పరిశీలించారు. ఆయనతో పాటు బెల్జియంలోని ఫ్లాండర్స్ రీజియన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమీషనర్ జయంత్ నడిగర్, వెర్మీరెన్ మేనేజింగ్ డైరెక్టర్ (శ్రీసిటీ ప్లాంట్) సయ్యద్ రియాజ్ ఖాద్రీ పాల్గొన్నారు.

## టీటీడీ చైర్మన్‌ను కలసిన రాష్ట్ర నాయి బ్రహ్మణ సంఘం



తిరుమల, అక్టోబర్ 14 ప్రభాతవార్త: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం సాధికార సమితి ముఖ్యనేతలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసారు. బోర్డు సభ్యుడు శాంతారాం ఆధ్వర్యంలో చైర్మన్‌ను కలిసి టిటిడిలో నాయి బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. తిరుమల క్షేత్రంతో నాయి బ్రహ్మణులకు ఉన్న చారిత్రిక అనుబంధాన్ని చైర్మన్‌కు వివరించారు. వారి వినతిపై చైర్మన్ బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించారు.

## పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించాలి : ఎంపీడీవో



బాలాయపల్లి, అక్టోబర్ 14 ప్రభాతవార్త: స్త్రీశక్తి కార్యాలయంలో ఆదాయ వనరులపై శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో డి.నారాయణ మాట్లాడుతూ ఏ విధంగా ఆదయ వనరులు ఎలా సమకూర్చు కోవాలో, గ్రామాల్లో పంచాయతీలను ఎలా అభివృద్ధి చేయాలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఆదాయం ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛందంగా గ్రామాల అభివృద్ధి భాగస్వాములు కావాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ డీజే వినీల్ కుమార్, సర్పంచులు బి వెంకటసుబ్బయ్య, కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శులు లీలావతి, మోహన రాజు, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

## దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



వెంకటగిరి, అక్టోబర్ 14 ప్రభాతవార్త : అత్యున్నత న్యాయస్థానం అయినటువంటి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయి పైన కోర్టు సమయంలో ఈ మధ్య కాలంలో జరిగినటువంటి దాడిని ఖండిస్తున్నట్లు ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయి పైన జరిగిన దాడిని ఈ దేశంలోనే దళితుల యొక్క ఆత్మ గౌరవం పైన ఈ దేశం యొక్క ప్రజాస్వామ్యం పైన. ఈ దేశం యొక్క రాజ్యాంగం పైన జరిగిన దాడిగా మేము భావిస్తున్నాము అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు బండి రవి. పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## యూరియా సమృద్ధిగా ఉంది : ఏడిప



వెంకటగిరి, అక్టోబర్ 14 ప్రభాతవార్త : రబి సీజన్‌కు సరిపడ యూరియా సమృద్ధిగా ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెంకటగిరి సబ్ డివిజన్ ఏడిప పి.అనసూయ తెలిపారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వెంకటగిరి సబ్ డివిజన్ పరిధి లోనీ వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాలకు సంబంధించిన ప్రైవేట్ డీలర్లు, సహకార సంఘాల వారితో యూరియా పంపిణీ పై సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వెంకటగిరి డివిజను పరిధిలో 205 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. యూరియా అవసరమైన రైతులు వారి రైతు సేవా కేంద్రములో ఆధార్ కార్డు మరియు సాగుచేయు పొలమును సంబంధించిన ఆధారములు పొందుపరచి యూరియా పంపిణీ కార్డులను తీసుకోవాలని తెలిపారు. అధిక ధరలకు యూరియా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం యూరియా, ఇతర ఎరువులను విక్రయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు ప్రవీణ, సుజాత, శిరీష, విజయలక్ష్మిలు పాల్గొన్నారు.

## చెర్లోపల్లిలో ఎస్‌బిఐ నూతన శాఖ ప్రారంభం







తిరుపతి, విద్య అక్టోబర్ 14 ప్రభాతవార్త: చెర్లపల్లి లో మంగళవారం ఎస్ బి ఐ నూతన బ్రాంచ్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్ హెచ్ ఓ అమరావతి సర్కిల్ సీజీఎం రాజేష్ కుమార్ పటేల్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ పటేల్ మాట్లాడుతూ, అత్యుత్తమ కస్టమర్ సేవలను అందించడానికి, ప్రాంతీయ ఆర్థిక సమ్మిళిత లక్ష్యాలకు సహకరించడానికి ఎస్‌బీఐ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలను అందించేందుకు, బ్యాంకింగ్ నెట్‌వర్క్‌ను విస్తరించడంలో భాగంగా ఈ శాఖను ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), ఏవో తిరుపతి నేడు ఐఐఎస్ఈఆర్ తిరుపతి కి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం కింద కీలక మౌలిక సదుపాయాలను విరాళంగా అందించింది. ఈ సందర్భంగా ఎస్‌బీఐ అందించిన మొత్తం విరాళం విలువ రూ.23,60,830/ .అత్యవసర వైద్య సేవలను మెరుగుపరచడానికి రూ.15,38,830/ విలువైన పూర్తిస్థాయి అంబులెన్స్‌ను క్యాంటీన్ సేవలను ఆధునీకరించి, సౌకర్యవంతంగా మార్చ డానికి రూ.8,22,000/ విలువైన ఆటోమేటిక్ కియోస్క్ వ్యవస్థను విరాళంగా ఇచ్చారు. విద్య,సామాజిక సంక్షేమం పట్ల ఎస్‌బీఐకి ఉన్న నిబద్ధతను ఈ చొరవ మరోసారి చాటి చెప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఉన్నతాధికారులు జీఎం అమరేంద్ర కుమార్, సుమన్, డీజీఎం దినేష్ గులాటి, ఆర్ ఎం ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

## డేటా సెంటర్ ఏర్పాటు చంద్రబాబు,లోకేష్ ఘనతే

**-ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు, అక్టోబరు 14 ప్రభాతవార్త : దేశ చరిత్రలో అతి పెద్ద డేటా సెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్‌బాబులకే దక్కుతుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. ఒక గిగావాట్ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్ కంపెనీతో ఒప్పందం చేసుకుందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు 10 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ సంస్థ వల్ల వేలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. గూగుల్ రాక వల్ల విశాఖ నగరం ఎఐ సిటీగా రూపాంతరం చెందుతుందని, రాష్ట్రానికి భారీ ఆదాయంతో పాటు యువతకు సుమారు 1.88 లక్షల ఉద్యోగాలు వస్తాయని వివరించారు. ఆసియాలోనే గూగుల్ చేపట్టనున్న అతి పెద్ద ప్రాజెక్టుల్లో విశాఖపట్నం ప్రాజెక్ట్ ఒకటిగా నిలుస్తుందన్నారు.

## కోటకాడపల్లి పరిసరప్రాంతాల్లో ఏనుగుల సంచారం

**-రైతులకు సంబంధించిన మామిడిచెట్లు ధ్వంసం -నష్టపరిహారన్ని అంచనావేసి నివేదిక పంపిన రెవెన్యూ అధికారులు**



యర్రావారిపాలెం, అక్టోబర్ 14 ప్రభాతవార్త: యర్రావారిపాలెం మండలం కోటకాడపల్లి పంచాయతీ కోటకాడపల్లె అటవీ సరిహద్దు గ్రామం కావడంతో అడవి జంతువుల సంచారం ఉంటుంది. ఏనుగులు సంచరించి పలువురు రైతులకు సంబందించిన మామిడి చెట్లను ధ్వంసం చేసినట్లు అటవీశాఖ అధికారులు సమాచారంతో రెవెన్యూ అధికారులు నష్టంజరిగిన పొలాలను సందర్శించి పంట నష్ట పరిహారాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. సుమారు 150 మామిడి చెట్లను ధ్వంసం చేసినట్లు తెలిపారు. విఆర్ఓ రవినాయక్, సర్వేయర్ షణ్ముఖ ప్రియ, హార్టికల్చర్ అసిస్టెంట్ స్వప్న పాల్గొన్నారు.

## జిల్లా జర్నలిస్ట్ క్రికెట్ టీంకు కలెక్టర్ అభినందనలు



తిరుపతి కలెక్టరేట్,అక్టోబర్ 14 ప్రభాతవార్త : అనంతపురం అంతర్జాతీయ ఆర్డిటి స్టేడియం వేదికగా అక్టోబర్ 5, 6,7,8 తేదీలలో ఆంధ్ర ప్రదేశ్ జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్(జేశాప్) ఆధ్వర్యంలో నిర్వహించిన జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ 2025 టోర్నీలో తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లా జట్టు ఛాంపియన్ గా నిలిచిన సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అభినందనలు తెలియజేశారు. మంగళవారం జిల్లా క్రికెట్ జట్టు కలెక్టరేట్ లోని ఆయన చాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో ఛాంపియన్స్‌గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. ముందు ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా జట్టుకు తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తామని తెలిపారు. కలెక్టర్ కలిసిన వారిలో జేశాప్ జిల్లా అధ్యక్షులు విజయ యాదవ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, కోశాధికారి నరేష్ రెడ్డి, కెప్టెన్ పులుగూరు శ్రీనివాసులు, క్రీడాకారులు కామేశ్వరయ్య, చిన్నబాబు, వెంకటేష్, మనోహర్, జగదీష్, సుబ్రహ్మణ్యం, సురేష్, ప్రతాప్, నరేష్, మదిఅలగన్, మునిశేఖర్, సతీష్, శ్రీనివాసులు, సాయి తదితరులు ఉన్నారు.

## పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారు : ఎంపీడీవో



వెంకటగిరి, అక్టోబర్ 14 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి తెలిపారు. పంజాము గ్రామం లో ఆయన పారిశుద్ధ పనులను పరిశీలించారు. అంగన్వాడి కేంద్రం ప్రాథమిక పాఠశాలలను కూడా ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. వీధుల్లో చెత్తాచెదారం వేయరాదని గ్రామస్తులకు సూచించారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్సీ బల్లి



వెంకటగిరి, అక్టోబర్ 14, ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ రోజు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య ఒక చారిత్రాత్మక ఒప్పందం కుదిరింది అన్నారు. విశాఖపట్నంలో 15 బిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన గిగావాట్ స్థాయి ఏఐ డేటా సెంటర్‌ను స్థాపించేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఈ డేటా సెంటర్ భారతదేశపు తొలి ఏ వన్ సిటీకి పునాది వేస్తుంది, అమెరికా వెలుపల అతి పెద్ద ఏఐ, డేటా హబ్‌గా నిలుస్తుంది అన్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూ నికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ మరియు మానవ వనరుల అభివృద్ధి మంత్రి లోకేష్‌తో కలిసి పాల్గొన్న రాష్ట్ర ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు : కమిషనర్



గూడూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ వల్ల నిత్యం ఉపయోగించే నిత్యవసర సరుకులు, మందులు గృహనిర్మాణ మెటీరి యల్స్ ధరలు తగ్గాయని వీటిని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సూచించారు. గూడూరు పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా ధరలు తగ్గిన గృహ నిర్మాణ వస్తువులతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. కమిషనర్ ఎగ్జిబిషన్ పరిశీలించారు. అదేవిధంగా ప్రజలు నిత్యం వినియోగించే అనేక మందులు నిత్యవసర సరుకులు ధరలు కూడా తగ్గాయని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వీరభద్ర స్వామి ఆలయంలో అన్నదానం



గూడూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త : పట్టణంలోని రాజా వీధిలో వెలసిన శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ భాగంగా నిర్వాహకులు మునిమోహన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. దాతలుగా సుంకర ఆది నారాయణ, సుజాత, సాయి, అన్వేష్, శ్రావణి, సాయి, ఆద్య, కుమార్తెలు వైష్ణవి, లహరి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## తిరుపతిలో డ్రగ్‌ఇంజక్షన్స్ కలకలం



తిరుపతి,అక్టోబర్ 14ప్రభాతవార్త: తిరుపతిలో మత్తుకోసం డ్రగ్స్ ఇంజక్షన్‌లు వాడుతున్న ముగ్గురు వ్యక్తులను తిరుపతిలోని ఆర్‌సి రైల్వేగేట్ పట్టాలపై పోలీసులు పట్టుకున్నారు. డ్రోన్‌సాయంతో దీన్ని గమనించిన పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని మత్తు ఇంజక్షన్‌లు తీసుకుంటున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి వారిని వెస్టు పోలీసు స్టేషన్‌లో ఉంచి విచారణ చేశారు. కౌన్సిలింగ్ ఇచ్చారు. యువత, వ్యక్తులు మత్తుకు బానిసలు కాకూడదని, జీవితం నాశనం చేసుకోవద్దని ఎస్పీ సుబ్బ రాయుడు విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహవర్గాలపై గమనించాలని సూచించారు. మత్తుపదార్ధాల వినియోగం, వాటికి సంబంధించి సమాచారం ఉన్నా 112కు తెలియజేయాలని ఎస్పీ కోరారు.

## సంజీవని హెల్త్ కేర్ ప్రాజెక్టు విస్తరణ : కలెక్టర్



చిత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త: కుప్పం నియోజకవర్గంలో సంజీవని హెల్త్ కేర్ ప్రాజెక్ట్ అమలు కోసం ప్రామాణిక ఆపరేటింగ్ విధానం సక్సెస్ కావడంతో ఈ ప్రాజెక్టును జిల్లా వ్యాప్తంగా అమలు చేయను న్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనం నుండి మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ సంజీవని హెల్త్ కేర్ ప్రాజెక్ట్ అమలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ప్రాజెక్ట్ అమలును సులభతరం చేయడానికి జిఎస్‌ఎంఎస్ విభాగం నుండి గృహడేటా పొందబడిందన్నారు. అలాగే ఆరోగ్యశాఖ నుండి అబా ఐడి డేటా సేకరించడం జరిగిందన్నారు. ఈ సంజీవని హెల్త్ కేర్ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం ప్రతి వ్యక్తి రికార్డులో ఇవి వున్నాయని నిర్ధారించుకోవడమేనని, చెల్లుబాటు అయ్యే అబా ఐడి, పని చేసే మొబైల్ నెంబర్‌ను సంజీవని హెల్త్ కేర్ ప్రాజెక్ట్ విజయవంతానికి ఈ రెండు అవసరమన్నారు. జిల్లా అంతటా సంజీవని హెల్త్‌కేర్ ప్రాజెక్ట్ డేటాను నమోదు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదికారి డాక్టర్ సుధారాణి, డిపిఎంఓ డాక్టర్ ప్రవీణ్, చిత్తూరు నియోజకవర్గ అధికారి డాక్టర్ అనూష, పూతలపట్టు నియోజకవర్గ అధికారి డాక్టర్ గిరి, జిడినెల్లూరు నియోజకవర్గ అధికారి డాక్టర్ హనుమంతరావు, నగరి నియోజకవర్గ అధికారి డాక్టర్ నవీన్‌తేజ్‌రాయి, పలమనేరు నియోజకవర్గ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, పుంగనూరు నియోజకవర్గ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, ఎంపిడిఓలు,సంబంధితఅధికారులు పాల్గొన్నారు.

## తిరుపతి ప్రైవేట్ పిజి హాస్టల్స్‌పై చర్యలు తీసుకోండి

తిరుపతి విద్య, అక్టోబర్ 14 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాలు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ని కలిసి తిరుపతిలో ని ప్రైవేట్ పీజీ హాస్టల్స్ విద్యార్థుల దగ్గర నెలకు వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ వారికి కనీసం మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారని,హాస్టల్లో వంటగదులు చాలా అపరిశుభ్రంగా ఉన్నాయని కనీసం శుభ్రత పాటించకుండా హాస్టల్ విద్యార్థులకు భోజనాలు తయారు చేసి పెట్టడాన్ని విద్యార్థి సంఘాలు కమిషనర్ ముందు ఖండించడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ స్టూడెంట్స్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ప్రైవేట్ పిజి హాస్టల్ పేరుతో ఏర్పాటు అయ్యి విద్యార్థులు దగ్గర నెలకు వేలాది రూపాయలను వసూలు చేస్తూ వారికి కనీసం పరిశుభ్రత తో కూడిన భోజనాలు కూడా పెట్టకుండా,కిచెన్ రూమ్ లన్ని కూడా చాలా అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ మాదిగ,యుగంధర్,జెడి ప్రసాద్,జ్యోతి కుమార్, తిరుమలేష్,మహేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.